Vist us @ www.sooryasena.com
RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం
తెలుగు దిన పత్రిక
Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool




శనివారం SATURDAY || 31.01.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 152 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah

## వనమంతా జనమై....




**వేడారం, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** సాధారణంగా మేడారం మహాజాతరలో ఎప్పుడూ రెండోరోజే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సమ్మక్క గద్దె చేరిన 24 గంటల తర్వాత జాతర పలుచబడుతుంది. ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. మూడోరోజు భక్తులు వరదలా పోటెత్తారు. ఫలితంగా శుక్రవారం జాతరలో పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. జాతర ప్రాంగణమంతా అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. జంపన్నవాగు, బస్టాండ్ ప్రాంగణం ఇలా ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంతగా భక్తజనం కనిపించారు. ప్రత్యేకించి క్యూలైన్ల వద్ద భక్తులను నియంత్రించడం పోలీసులకు సవాలుగా పరిణమించింది. గద్దెల వద్ద వెళ్లే అన్ని ప్రధాన ద్వారాల వద్ద భక్తులు కిక్కిరిసిపోవడంతో లోపలివారు బయటకు రాలేని పరిస్థితి.. అలాగే బయటి వారు లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇది తొక్కిసలాటకు దారితీసింది. మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైన్లలో ఊపిరాడక చిన్నారులు గుక్కపెట్టి ఏడ్చారు. ఓ చిన్నారి స్పృహ తప్పి పడిపోయింది. క్యూలైన్‌లో నిల్చున్నవారికి తాగేందుకు నీళ్లు లేక వారి గొంతులు దప్పికతో తడారిపోయాయి. కొందరు



అస్వస్థతకు గురయ్యారు. గద్దెల వద్ద కొబ్బరి కాయలు, బెల్లం బుట్టలు తగిలి పలువురికి గాయాలయ్యాయి. రద్దీని నియంత్రించడానికి పోలీసులు పలుమార్లు లాఠీలకు పనిచెప్పారు. ఒకదశలో రద్దీని తగ్గించేందుకు వీఐపీల క్యూలైన్లలోకి సాధారణ భక్తులను అనుమతించారు. అయితే సాధారణ క్యూలైన్లో నిల్చున్నవారంతా వీఐపీ క్యూలైన్ల వైపు పరుగులు తీయడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు గద్దెల వద్దకు చేరుకోవడానికి ఐరన్ గ్రిల్స్‌ను దూకాల్సివచ్చింది. గద్దెలను దర్శించుకున్న భక్తులు తిరుగుముఖం పట్టడంతో మేడారంలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్ జనంతో కిక్కిరిసిపోయింది. సరిపడా బస్సులు లేకపోవడంతో భక్తులంతా అక్కడే తిష్టవేయడంతో జాతరంతా బస్టాండ్‌కు మారినట్లయింది. మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగాయి. దర్శనానికి మూడు నుంచి నాలుగు గంటలు పట్టింది. ట్రాన్స్‌జెండర్లలో కొందరు ఎంతసేపు వేచి ఉన్నా దర్శనం కాకపోవడంతో సహనం నశించి ప్రధాన గేట్ ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. భక్తుల తాకిడి పెరగడంతో పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. జాతరకు వచ్చిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం తల్లులను దర్శించుకున్నారు. గద్దెల ప్రధాన గేట్ వద్ద మంత్రి సీతక్క సురేఖకు స్వాగతం పలికారు. గద్దెల వద్దకు తోడ్కొని పోయి దర్శనం చేయించారు. అనంతరం సురేఖ పోలీసు కంట్రోల్ రూం ప్రాంగణంలో కోయ కళాకారుల నృత్య ప్రదర్శనను తిలకించారు. వారితో కలిసి గుస్సాడి నృత్యంలో పాల్గొన్నారు. సరదాగా స్టెప్పులు వేశారు. వీఐపీల తాకిడి శుక్రవారం పెరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మేడారాన్ని సందర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం హెలిప్యాడ్‌లో దిగారు. ఆయనకు మంత్రి సీతక్క, కలెక్టర్ టీఎస్ దివాకర్ స్వాగతం పలికారు. గవర్నర్ నిలువెత్తు బంగారాన్ని సమర్పించి.. తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సినీ హాస్య నటుడు శివారెడ్డి దంపతులు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ. వై. నాగిరెడ్డి.. వనదేవతలను దర్శించుకున్నారు.

## హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన రేవంత్ రెడ్డి



**హార్వర్డ్ / హైదరాబాద్ జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి సందడి చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా సిఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో 62 మంది విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను సిఎం రేవంత్‌రెడ్డి పంచుకున్నారు. 21వ శతాబ్దంలో నాయకత్వం అనే ప్రోగ్రామ్ పై విద్యార్థులు ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు -15 నుండి -24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల మధ్య పని చేశారు. ఈ కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు.

## కత్తి చంద్రబాబుది.. పొడుస్తున్నది రేవంత్ రెడ్డి : హరీష్ రావు

**హైదరాబాద్, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ సాధించిన పార్టీగా రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. తెలంగాణ వారే రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నదీ జలాలపై తాము మాట్లాడిన తర్వాత ప్రభుత్వం ఉత్తరాలు రాస్తోందని, బనకచర్ల ప్రాజెక్టు పేరు మారినా తెలంగాణకు ద్రోహం మారలేదని విమర్శించారు. ప్లాన్ ప్రకారమే పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు కు రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని, ఢిల్లీలో జరిగేది.. పేరుకే జలవివాదాల మీటింగ్ అని.. కత్తి ఎపి చంద్రబాబుది.. పొడుస్తున్నది సిఎం రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. నల్లమల సాగర్ పూర్తయ్యాక సుప్రీంకోర్టుకు వెళ్లారని, కేసు వేయమంటే చెల్లని రిట్ వేసి వాపస్ తెచ్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నీళ్లను నల్లమల సాగర్ కు తరలించడమే ప్రధాన ఉద్దేశమని, ఎపి ప్రభుత్వం ఒత్తిడితోనే ఢిల్లీలో మీటింగ్ పెట్టారని తెలియజేశారు. రేవంత్ రెడ్డి



గురుదక్షిణ కింద వెళ్తున్నారా? అని ప్రశ్నించారు. నల్లమల సాగర్ డిపిఆర్ ప్రక్రియను ఆపాలని ఒక కండిషన్ పెట్టారని, ఈ రెండు కండిషన్లకు ఒప్పుకుంటేనే ఢిల్లీలో మీటింగ్ కు వస్తారని లేఖ రాశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారం ఇచ్చింది గోదావరి నీళ్లను ఆంధ్రాకు ధారాదత్తం చేయడం కోసం కాదని హరీష్ రావు ధ్వజమెత్తారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతర పోరాటం

- టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య
- అట్టహాసంగా మహబూబ్ నగర్ జిల్లా నాల్గవ మహాసభల
- తెలంగాణ వాదాన్ని, కాంగ్రెస్ గళాన్ని ప్రపంచానికి చాటింది జర్నలిస్టు యోధులే
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేయిస్తా
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్
- అనారోగ్య సమస్యలతో బాధపడే జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాం
- సుశ్రుత ప్రజా వైద్యశాల ఎం.డి డాక్టర్ మధుసూదన్ రెడ్డి
- జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన జర్నలిస్టులు
- సీనియర్ జర్నలిస్టులకు ఘనంగా సన్మానం




**మహబూబ్ నగర్, జనవరి 30 (సూర్య సేన) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమిస్తామని, జర్నలిస్టుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వివి కన్వెన్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు వాకిటి అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 4వ మహాసభలో




ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని, అయినప్పటికీ వారి సమస్యలను పాలక వర్గాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 80 గజాల స్థలం కోసం జర్నలిస్టులు 30 ఏళ్లుగా నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ ల కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులపై 360 డిగ్రీల విచారణ అనేది ఎంత వరకు సమంజసమని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. జర్నలిస్టుల పట్ల పాలకుల తీరు శోచనీయమని విమర్శించారు.

జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లు

రైల్వే పాసులను వెంటనే పునరుద్ధరించాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచిత బస్ పాసులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, జర్నలిస్టులకు నివాస స్థలాల కేటాయింపులో న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. హక్కుల కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ బండి విజయ్ కుమార్, సీనియర్ జర్నలిస్టు మంగళగిరి యాదగిరి, ఏముల నర్సింహులు, మహ్మద్ రఫీ తదితరులు మాట్లాడారు.

2వ పేజీ లో...

## అజిత్ పవార్ శాఖలపై సీఎంను కలిసిన ఎన్‌సీపీ నేతలు




**ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (ఆయింట్‌ఖ్ఖుఘ్ఖుతీ) గత బుధవారంనాడు విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన చేతిలోని పదవుల విషయమై నేషనల్ కాంగ్రెస్ పార్టీ నేతలు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఆయన నివాసమైన 'వర్ష' బంగ్లాలో శుక్రవారంనాడు కలుసుకున్నారు. మహాయుతి కూటమి ప్రభుత్వంలోని ఎన్‌సీపీ కోటాలో భాగంగా అజిత్ చేతిలో కీలకమైన ఆర్థిక, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖలు కూడా ఉన్నాయి.

2వ పేజీ లో...

## అప్పుడు ఐటి.. ఇప్పుడు ఎఐ : చంద్రబాబు

**అమరావతి, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** మనం మాత్రమే కాదు.. సమాజం కూడా బాగుండాలనేది మన సంస్కృతి అని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పిల్లలు ఎంత పెద్దవాళ్లయినా జీవితాంతం ఏ సహాయం కావాలన్నా అందించే సంస్కృతి మనది అని అన్నారు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గుంటూరు జిజిహెచ్ మాతా శిశు కేంద్రాన్ని సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.. కళాశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనేక సేవా కార్యక్రమాలను ముందుకొచ్చి భారీగా విరాళాలు ఇస్తున్నారని, చైతన్యం పెరిగిందని.. సేవా కార్యక్రమాలకు చాలా మంది ముందుకొస్తున్నారని అన్నారు. జన్మభూమి కార్యక్రమానికి పిలుపు ఇవ్వగానే అభివృద్ధికి దోహదం చేశారని, ఆర్థిక



అసమానతలు తగ్గితేనే సమాజం బాగుంటుందని సూచించారు. చదువు అనేది గేమ్ ఛేంజర్.. సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలని, భారతరత్నకు మారు పేరుగా దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత స్థితికి చేరుకుంటారని, ఆర్థిక అసమానతలు తగ్గాలి.. పేదరికం లేని సమాజం చూడాలి అని అన్నారు.

సూర్యసేన

శనివారం, జనవరి 31, 2026

# జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతర పోరాటం



ఉచిత వైద్యం, పరీక్షలు అందిస్తాం
సుశృత హాస్పిటల్ ఎండీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు, సుశ్రుత పీపుల్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచితంగా రక్త పరీక్షలు ఉచిత బిపి షుగర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడే జర్నలిస్టు కుటుంబాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. జర్నలిస్టుల విధులు ఒత్తిడితో కూడుకున్నవని, ఈ వృత్తిలో ఉన్న వాళ్లకు షుగర్ , బీపీ రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కొందరు సీనియర్ జర్నలిస్టుల కోరిక మేరకు తన ఆసుపత్రిలో జర్నలిస్టుల కుటుంబాలకు ప్రతి నెల ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మెడిసిన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ గళాన్ని ప్రంచానికి చాటింది జర్నలిస్టు యోధులే

డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఈ కార్యక్రమానికి హాజరైన డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ వాదాన్ని కాంగ్రెస్ గలన్ని ప్రపంచానికి చాటింది జర్నలిస్టు యోధులైనని తెలిపారు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే ముఖ్యమంత్రిని కల్పించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు. టీపిసిసి జనరల్ సెక్రటరీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. 10 లక్షల మేర ఆరోగ్య భీమా అందుతున్నదని తెలిపారు.

తన తండ్రి మాజీ పార్లమెంటు సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి ఏ విధంగా జర్నలిస్టులకు అండదండగా ఉన్నారో, తాను కూడా అదే విధంగా జర్నలిస్టులను తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ తనది గోల్డ్ స్పూన్ జీవితం కాదని అట్టడుగు స్థాయి నుండి వచ్చిన తనకు జర్నలిస్టు కుటుంబాల స్థితిగతులు తెలుసని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందని అన్నారు. జర్నలిస్టుల డిమాండ్లపై చర్చిస్తుందని, తమ ప్రభుత్వ హయాంలో అమలు అయ్యే అవకాశం ఉందన్నారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మహబూబ్నగర్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాకిటి అశోక్ కుమార్ (మన ఉదయం బ్యూరో), వర్కింగ్ ప్రసిడెంట్ గా గండిటి నరసింహులు (ప్రజా దర్బార్), ఉపాధ్యక్షులుగా పానుగంటి సురేందర్ (నిజాయితీ పత్రిక బ్యూరో), హరి ప్రసాద్, సుకుమార్, ప్రధాన కార్యదర్శిగా మొలకలపల్లి గోపాల్ మహారాజ్, సహాయ కార్యదర్శులుగా ఎం. దాసు, ఖాజా మైనుద్దీన్, అశోక్ కుమార్, కోశాధికారిగా ఏముల నరసింహులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మంగళగిరి యాదగిరి, బండి విజయకుమార్, ఎండి రఫీ, జాతీయ కమిటీ సభ్యులుగా పసుపుల శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు ఎండి, మోయిస్, ఈసీ మెంబర్స్ గా కొమ్ము దామోదర్, జంగం దిలీప్ కుమార్, రఘు, కృష్ణ , గోపాల్ యాదవ్ , చందు, మేకల శ్రీనివాస్, అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రమాకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్. నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, రాష్ట్ర నాయకులు కుడితాడి బాబురావు వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, పద్మనాభరావు, మహిళా జర్నలిస్టులు సాజిదా సికిందర్, సంధ్య తదితరులతో పాటు దేవరకద్ర, జడ్చర్ల, మహబూబ్ నగర్ నియోజక వర్గ మండలాల టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, వివిధ పత్రికలు, చానళ్ళ జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల పాటు జర్నలిజం వృత్తి జీవితాన్ని పూర్తిచేసిన సీనియర్ జర్నలిస్టులను గుర్తించి మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాల్సిందే



– బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**రంగారెడ్డి , జనవరి 30 (సూర్య సేన) :** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునరుద్ధరించి విస్తరించాలని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు పత్రికల వారితో మాట్లాడుతూ స్త్రీ పురుష కూలీలు తట్టలు ఎత్తి 100 రోజులు ఉపాధి పొందాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో ప్రవేశపెట్టిన పథకాన్ని బుట్ట దాఖలు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదని ఆ పథకాన్ని ఆరు నూరైనా "చెయ్యి"జారనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకాన్ని కాల రాయడం అంటే రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయడమేననిఅన్నారు. స్వాతంత్ర్యానికృతందేశంలో ఏ విధమైన పరిస్థితులు ఉన్నాయో ఆనాటి చీకటి బతుకులను గుర్తు చేసేలా రోజులుదాపరిచాయని అధికారాన్ని కేంద్రీకరించి పేద ప్రజలను ఆకలితో చంపేందుకు కొత్త చట్టం తెరపైకి తెచ్చారని చట్టాన్ని సంస్కరించే పేరుతో దాని నుండి ఆర్థిక భద్రతను తొలగించారని అన్నారు. కేంద్రం హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఉపాధి హామీ పనులు చూపలేక పేదలకు పట్టణం పెట్టకుండా ఉన్న పథకాన్ని రద్దు చేశారని ధ్వజమెత్తారు.

**– బీసీలేకేంద్రంగా ప్రజా పాలన సాగుతుంది**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనబీసీలే కేంద్రంగా సాగుతుందని గుర్తు చేశారు. కులగణనచేయించిన ఘనత మా నాయకుడు రాహుల్ గాంధీకి దక్కుతుందని కుల గణన సర్వే ద్వారా బీసీల జనాభా 56% ఉందంటూ అధికారిక డాక్యుమెంట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు .విద్యా ఉద్యోగం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కోసం మూడు చట్టాలను చట్టసభలలో ఆమోదించి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేస్తే రాష్ట్రపతి గవర్నర్లు పెండింగ్లో పెట్టుకున్నారని అన్నారు. 2029లో జరిగే లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువచ్చి రాహుల్ను ప్రధాని చేస్తే 42% రిజర్వేషన్లపై చట్టబద్ధత తెచ్చుకుంటాం అని అన్నారు.

**– ప్రజల జీవితాలలో మార్పుతోనేఅభివృద్ధి**

అభివృద్ధి అంటే కేవలం భవన నిర్మాణాలేకాదని ప్రజల జీవితాలలో మార్పులు తేవడమే నిజమైన అభివృద్ధి అని ప్రజా ప్రభుత్వం హామీలను ఒక్కటి ఒక్కటిగా అమలు చేస్తుందని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య వైద్యంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వం కేవలం పథకాలు ప్రకటించడమే కాదు వాటిని లబ్ధిదారులకు చేర్చేలా చర్యలు తీసుకుంటుందని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

# దర్యాప్తులో ఆలస్యం... న్యాయానికి అన్యాయం

– ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త మాతా శ్రీ జానకమ్మ

**రంగారెడ్డి జనవరి 30 (సూర్య సేన) :** మహిళలను చూస్తే మెదడులో మురికి ఆలోచనలు వరదలెత్తే ప్రబుద్ధులకు రాష్ట్రంలో దేశంలో కొదవలేదని కిరాతక నేరాలకు పాల్పడుతున్న నరరూప రాక్షసుల వరకు ఎవరికీ మన సమాజంలో చోటు లేదు స్త్రీల భద్రతకు ప్రాణ సంకటంగా తయారైన పాపాత్ములను వెంటనే పట్టుకుని త్వరితగతిన శిక్షలు పడేలా చూడడం పోలీసుల బాధ్యత. ఈ విషయంలో ఖాకీలు ఎంతవరకు సఫలమవుతున్నారనిచూస్తేఎవరి గుండెలైనబరువెక్కాల్సిందేఅని ప్రముఖ న్యాయవాది సామాజిక వెత్తమాతా శ్రీ జానకమ్మ అన్నారు. శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆధారల సేకరణ,వాటి పరిశీలన, న్యాయస్థానాలలో సమర్పణ, తదితరాలలోఅనేక లోపాల వల్ల చాలా అత్యాచార కేసుల్లో దోషులు ఎవరో తేలడం లేదని ఒకవేళ కింది కోర్టులో శిక్ష పడిన పసలేని దర్యాప్తులవల్లపైకోర్టులో ఆ కేసులు వీగిపోతున్నాయనిఆధునిక సాంకేతికతకుకొత్త పుంతలు తొక్కుతున్న ఈ కాలంలోనూ దేశానికి పట్టినచీడపురుగులను సమర్థంగావదిలించలేకపోవడం ఎంతో సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీలో నిర్భయ దారుణోదాంతంతర్వాత మహిళలపైదాష్టికాలకుఒడిగట్టే వారికి కఠిన శిక్షలువిధించేలా చట్టాలు వదునుతేల్చారని అది సంతోషించదగ్గ విషయమే కానీ దర్యాప్తులేప్రహసనప్రాయంగా మారుతున్నప్పుడుసెక్షన్లు ఎంత పదునుపెట్టి ఏంటి? ప్రయోజనం అని ప్రశ్నించారు. ఎంతోమంది వేదనతో పోలీస్ స్టేషన్కు వెళ్లిన వారిని పట్టుకుని కూతుళ్ళ ముందు వారిని విచారించేందుకు తల్లిదండ్రులను బయటకు పంపడం మీద వ్యక్తిత్వ హననం చేయడం కొందరికి పరిపాటిగా మారింది అన్నారు. పోలీసుల వ్యవహార శైలితో తమ మానసిక వేదన రెట్టింపు అయినట్లు



73% అత్యాచార బాధితులు ఒక జాతీయస్థాయి సర్వేలో వాపోయినట్లునివేదిక వెల్లడించింది అని తెలిపారు. ఈ దయనీయ వ్యవస్థకు తోడు నానా మాటలతోకాల్చుకో తినే సమాజానికి భయపడి చాలామంది లైంగిక దాడులకు నిశ్శబ్దంగాఉండిపోతూ తమలో తామేకుమిలిపోతున్నారని దీనివల్ల అత్యాచారదారుణాలన్నీ పూర్తిగా బయటికి రావటం లేదని ఇలాంటి భయానక వాతావరణంలో మహిళల శక్తి సామర్థ్యాలను దేశం ఎలావినియోగించుకోగలుగుతుంది అన్నారు.జనాభాలో దాదాపు సగభాగమైనస్త్రీలకు తగిన భద్రత లేనప్పుడు అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు.

# సర్పంచ్ చొరవతో సురక్షిత రహదారి
# వెలిదండలో రోడ్డుపక్క మట్టి, రాళ్ల తొలగింపు...

**గరిడేపల్లి ప్రతినిధి, జనవరి 30 (సూర్య సేన) :** గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో రోడ్డుపక్కన పేరుకుపోయిన మట్టి, రాళ్లను తొలగించే పనులను గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వాటిని గమనించిన సర్పంచ్ తక్షణమే స్పందించి కుల్లోల సహాయంతో శుభ్రత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రతతో పాటు రహదారి భద్రతకు గ్రామపంచాయతీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రోడ్డు విస్తరణ పనుల సమయంలో పేరుకుపోయిన మట్టిని తొలగించడం వల్ల రవాణా



మరింత సౌకర్యవంతంగా మారుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఇలాంటి పనులు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గాంధీజీకి ఘన నివాళులు... సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి



– హుజూర్నగర్‌లో వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ కార్యక్రమాలు

**హుజూర్నగర్ ప్రతినిధి జనవరి 30 (సూర్యసేన) :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వాసవి క్లబ్ ఉ వాసవి వనిత క్లబ్ లెజెండ్ హుజూర్నగర్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ పార్కులో గాంధీజీ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కీర్తిశేషులు వరగాని రాములమ్మ జ్ఞాపకార్థం దాత వారి కుమారుడు శ్రీనివాసరావు ఆయన ధర్మపత్ని మంజుల చేతుల మీదుగా పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓరుగంటి నరసింహారావు, రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి లక్ష్మీ నరసింహారావు, మా శెట్టి అనంత రాములు, గుండా రమేష్, బచ్చు రామారావు పాల్గొన్నారు. అలాగే వాసవి క్లబ్ జడ్ సి కరాలపాటి పాపారావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వీరవెల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటేశ్వర్లు, కోశాధికారి కాళంగి నరసింహారావు పాల్గొన్నారు.


వాసవి వనిత క్లబ్ లెజెండ్ జెడ్ సి పోలిశెట్టి ఝాన్సీ రాణి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు పెనుగొండ రాజ్యలక్ష్మి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెచ్చా శ్యామల మాధవ్, కోశాధికారి ఆరేటి వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్. ఉప్పల, రాము, నరేష్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, అలాగే దాస నాగేశ్వరావు, చెపురి లక్ష్మణ్ (వీడియో), బూరుగు శ్రీనివాసరావు, వర్తక సంఘం అధ్యక్షులు నీరుమళ్ళ నరసింహారావు, కామిశెట్టి శేఖర్, దయాకర్, సతీష్, చిరంజీవి, గణేష్, గెల్లీ కొండలరావు, మధుసూదన్ రావు, అనంత రాములు, అత్తులూరి నరసింహారావు, గుడిపాటి ప్రవీణ్, చేపూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డిపల్లి కేవీకేలో చిరుధాన్యాలపై మహిళలకు శిక్షణ ముగింపు




**గరిడేపల్లి ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి లో శుక్రవారం "చిరుధాన్యాలు -- వాటి విలువాధారిత ఉత్పత్తులు" అంశంపై యువతులు, మహిళలకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఎం. చైతన్య మహిళా సాధికారిక కేంద్రం కోఆర్డినేటర్ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతతో పాటు మహిళా సాధికారతను సాధించుకోవాలని సూచించారు. గ్రూపులుగా ఏర్పడి చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తులు తయారు చేస్తే ఉపాధి అవకాశాలు లభించడమే కాక ఆరోగ్యం, ఆదాయం రెండూ పొందవచ్చని తెలిపారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కేవీకే ఇంచార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ (ఐ/సి) డి. నరేష్ మాట్లాడుతూ చిరుధాన్యాల వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, వాటితో విలువాధారిత ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా యువత స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్. సుగంధి మాట్లాడుతూ రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాల పోషక విలువలు వివరించారు. వీటితో తయారు చేయగల బిస్కెట్లు, కేకులు, లడ్డులు, మురుకులు, చెక్కలు, సజ్జ బూరెలు వంటి వివిధ విలువాధారిత ఉత్పత్తుల తయారీ విధానాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన గడ్డిపల్లి గ్రామ సర్పంచి ఎం. నాగలక్ష్మి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీ.హెచ్. నరేష్, పి. అక్షిత్, ఏ. నరేష్, మహిళా సాధికారిక కేంద్రం సభ్యులు, సఖి కేంద్రం సభ్యులు పాల్గొన్నారు. గరిడేపల్లి, సూర్యాపేట ప్రాంతాలకు చెందిన సుమారు 40 మంది మహిళలు, యువతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయంలో విద్యార్థుల కష్టాలు- అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం



**రంగారెడ్డి, జనవరి 30 (సూర్య సేన) :** బడంగ్ పేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం పక్కనే ఉన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ విద్యార్థులకు నరకప్రాయంగా మారింది.అని భారతీయ జనతా పార్టీ బడంగ్ పేట అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు, పైన పటారం లోన లొటారం అన్నట్లుగా గ్రంథాలయ పరిస్థితి ఉందని విమర్శించారు.

గ్రంథాలయానికి చదువుకోడానికి వచ్చే విద్యార్థులకు సరైన కుర్చీలు ప్యాడ్స్ వసతులు లేవని తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ అవుట్లెట్ లేక సెప్టిక్ ట్యాంకు ప్రతిరోజు పొంగిపొర్లుతూ భయంకరమైన దుర్వాసనతో విద్యార్థులు చదవలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని నీటి సంపు పై మూత లేక ప్రమాదం పొంచి ఉందని వెల్లడించారు. గ్రంథాలయం పక్కనే డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఇతర ఉన్నతాధికారులు కార్యాలయాలు ఉన్నప్పటికీ ఈ సమస్యలు కల్పించకపోవడం పరమ వైఫల్యం అని మండిపడ్డారు. పారిశుద్ధ్యం పై స్పెషల్ డ్రైవ్ అంటున్న అధికారులు ఇదేనా? మీ స్పెషల్ డ్రైవ్ అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని అధికారులు బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశపాక జగన్ కార్పొరేషన్ కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, గ్రంథాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

# కుష్టుపై వివక్షకు చెక్... అవగాహనతోనే నివారణ

**గరిడేపల్లి ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో "వివక్షను అంతం చేయడం గౌరవాన్ని కాపాడటం" అనే నినాదంతో స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం జనవరి 30, 2026 నుండి ఫిబ్రవరి 13, 2026 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డా. వి. నరేష్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, మందంగా మెరిసే జిడ్డు చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, అరచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చేతులు కాళ్లకు తిమ్మిర్లు, వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం వచ్చే లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ఆశా కార్యకర్తలకు లేదా ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. నిర్ధారణ అయిన వారికి ఎండీటీ చికిత్స విధానం ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. ప్రతి గ్రామంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఆయన కోరారు. ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ హాజరయ్యారు. ఉప సర్పంచ్ ఎం. సంజీవ, సిహెచ్ఓ టి. నరసింహ, సూపర్వైజర్లు ఎన్. అంజయ్య గౌడ్, వెంకటరమణ, సెక్రటరీ నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది కవిత, అంజలి, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నిక

**హుజూర్నగర్ ప్రతినిధి, జనవరి 30 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల బార్ కౌన్సిల్ కార్యవర్గ నియామకానికి శుక్రవారం జరిగిన పోలింగ్ హుజూర్ నగర్ లో ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారి అంబటి శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్ నగర్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ లో 85 మంది పురుషులు, 7 మంది మహిళ న్యాయవాదులు మొత్తం కలిపి 92 మంది న్యాయవాదులు ఓటు హక్కును కలిగి ఉండగా వారిలో 92 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోవటంతో నూటికి నూరు శాతం ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. పోలింగ్ పర్యవేక్షకులుగా నియమించబడిన ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, కోర్టు సూపరింటెండెంట్ పానుగోతు సైదా నాయక్ ల పర్యవేక్షణలో జరిగిన ఈ పోలింగ్ ప్రక్రియకు తమకు పూర్తిగా సహకరించిన న్యాయవాదులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సూర్యసేన

శనివారం, జనవరి 31, 2026

# ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలి



**– వ్య.కా.సం. నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి**

**నేరేడుచర్ల ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** యూపీఏ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడం కోసం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని గంట వారి గూడెం గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ....

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జి రామ్ జి బిల్లు రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని గత ప్రభుత్వాలు చేసిన అన్ని చట్టాలు తిరగతోడుతున్న దని బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు రద్దుచేసి వారి స్థానములో నాలుగు కోడ్ లను తీసుకువచ్చిందని గతంలో లాగే జాబ్ కార్డు ఉన్నవారికి రెండు వందల రోజులు పని కల్పించి రోజుకు 700 రూపాయల వేతనం ఇవ్వాలని ఇప్పుడు తెచ్చిన కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భరించాల్సి వస్తుందని కానీ రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం కూడా భరించే పరిస్థితులు లేనందున తక్షణమే జి రామ్ జి చట్టాలని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఉపాధి హామీ పథకంలో రాముడు పేరు జొప్పించాలనే వెకిలితనం కనిపిస్తుందని రాముడి గుడి కట్టక ముందు 303 పార్లమెంటు స్థానాలు ఉన్న బిజెపికి రాముడు గుడి గట్టిన తర్వాత 60 ఎంపీ స్థానాలు కోల్పోయి 240 స్థానాలకు పరిమితం అయ్యారని సాక్షాత్తు అయోధ్యలో బిజెపి ఓడిపోయిన విషయాన్ని బిజెపి పార్టీ నేతలు గమనించాలని ప్రజలు చైతన్యమవుతున్నారని బిజెపి చేస్తున్న వికృత చేష్టలు వికృత క్రీడలకు చరమగీతం పాడే రోజు దగ్గరలోనే ఉందని ఆయన జోస్యం చెప్పారు రైతులకు ఇ స్తున్న విద్యుత్ ను ప్రైవేటుపరం చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని వ్యవసాయన్ని ధ్వంసం చేసేందుకు బిజెపి పార్టీ కంకణం కట్టుకున్నదని అన్నదాతకు చేయూతలిచ్చే నూతన రైతు విత్తన చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకల రాజు శ్రీను సోమగాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ నరేష్

**సూర్యాపేట టౌన్, జనవరి 30 (సూర్య సేన) :** ప్రజా యుద్ధనౌక,విప్లవకవి గద్దర్ జయంతిని పురస్కరించుకొని నాశీపల్లి కేంద్రంలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారకరామారావు కళామందిరంలో గురువారం రాత్రి ఫాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్, ఇండో కెనెడి యన్ యూత్ కౌన్సిల్,పుడమి సాహితి వేదిక సంస్థల సంయుక్త నిర్వహణలో అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి డా, జీవి వెన్నెల గద్దర్ చేతుల మీదుగా సూర్యాపేట కు చెందిన తెలంగాణ దళిత విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాఘవేంద్ర డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రొప్రైటర్, ఐఎన్టియుసి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కల్లేపల్లి నరేష్ గద్దర్ స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ సాంస్కృతిక సామాజిక సాహిత్య కేదారంలో సమాజాన్ని జాగృతం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించిన ప్రజాయుద్ధ నౌక, జానపద వాగ్గేయకారుడు, విప్లవ కవి గద్దర్ అన్న యాధిలో జాతీయ స్ఫూర్తి పురస్కార జ్ఞాపక, ప్రశంశ పత్రం అందుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాటలతో కీలక పాత్ర పోషించిన గద్దర్ తెలంగాణ గుండె చప్పుడు అని కొనియాడారు.

పుడమి సాహితి వేదిక చైర్మన్ చిలుముల బాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేణుగోపాల చారి, పురస్కారాల ప్రధాత, గద్దర్ కుమార్తె డాక్టర్ జి వి వెన్నెల గద్దర్, ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు రొయ్యూరు శేష సాయి, టిటిడి బోర్డు పూర్వ సభ్యులు ధరావత్ బాల్ సన్ నాయక్, పారిశ్రామిక వేత్త డాక్టర్ యామినేని ఉప్పల్ రావు, సామాజికవేత్త గొల్లమందల దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# బూరుగడ్డలో కుంకుమ పూజ, గోపూజ కార్యక్రమం



**హుజూర్నగర్ ప్రతినిధి, జనవరి 30 (సూర్య సేన) :** బూరుగడ్డలోని శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే కుంకుమ పూజ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటలకు భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం ఉదయం 10 గంటలకు గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గోపూజ కార్యక్రమానికి ములుగు భాస్కర్--వీణ, జూలకంటి ఉపేందర్--మమత, మంచాల శ్రీధర్--కవిత, అయిత వెంకటరమణయ్య--సులోచన, శివరామకృష్ణ--కవిత, చవుగాని రవి దంపతులు సహకరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారా చార్యులు, సతీష్ చారి, నరేష్, చంద్రయ్య, విజయ్ కుమార్, నరసయ్య పాల్గొన్నారు. అలాగే లక్ష్మి, విజయ, నవిత, సరిత, కవిత, నాగమణితో పాటు ఆలయ సిబ్బంది వై. కిరణ్ గౌడ్, వై. ఉపేందర్ పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# మల్లయ్యపై దుష్ప్రచారం ఆపాలి.. బహిరంగ చర్చకు సిద్ధం: బీఆర్ఎస్



– రాజేష్ మరణంపై ఉత్తమ్ దంపతులు మౌనం వీడాలని డిమాండ్..

కోదాడ/మునగాల, జనవరి 30 (సూర్యసేన): కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అసత్యమని, దుష్ప్రచారం నిలిపివేయాలని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ఎల్పీ రామయ్య హెచ్చరించారు.

దళిత యువకుడు కర్ల రాజేష్ మృతిపై నిజాలు బయటపెడుతున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం మల్లయ్య యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కోదాడ నియోజకవర్గంలో ప్రతి కుటుంబం ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందిందన్నారు. పార్టీ తేడా లేకుండా సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, రైతుబంధు వంటి పథకాల ద్వారా అనేక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించామని వివరించారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకుల కుటుంబాలకు కూడా వైద్య, వివాహ సహాయం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. 25 ఏళ్ల ఉత్తమ్ దంపతుల రాజకీయ చరిత్రలో నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్షంగా చేసిన సహాయం ఏమిటో వెల్లడించాలని ప్రశ్నించారు. మల్లయ్య యాదవ్ ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కర్ల రాజేష్ మరణంపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో పారదర్శక విచారణ జరిపించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మల్లయ్య యాదవ్ నాయకత్వంలో ప్రజా పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తొగరు రమేష్, ఉపాధ్యక్షులు గోపిరెడ్డి నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోలా ఉపేందర్, పట్టణ అధ్యక్షులు ఉడుం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన శస్త్రచికిత్సతో మేక ప్రాణాలు కాపాడిన వైద్యులు

**– గర్భాశయం బయటకు వచ్చిన ఘటన..**
**28 ఏళ్ల సేవలో తొలి కేసు**

**కోదాడ ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** అరుదుగా ఎదురయ్యే వైద్య పరిస్థితిలో గర్భాశయం బయటకు వచ్చిన మేకకు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన ఘటన కోదాడలో చోటుచేసుకుంది. స్థానిక రైతు మటన్ సెంటర్ నిర్వాహకులు పెంచుకుంటున్న మేకకు ఈ సమస్య తలెత్తగా, ప్రాంతీయ పశువైద్యశాలలో చికిత్స అందించారు. ఇటీవల పిల్లలు పెట్టిన మేకకు రెండు రోజుల క్రితం గర్భాశయం గుడ్లమాయతో సహా బయటకు వచ్చి రక్తస్రావం కావడంతో యజమానులు గమనించలేకపోయారు. దీంతో మట్టి, చెత్త అంటుకుని పరిస్థితి విషమించింది. శుక్రవారం ఉదయం గుర్తించిన యజమాని వెంటనే మేకను పశువైద్యశాలకు తరలించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. పెంటయ్య మేకను పరిశీలించి యాంటీసెప్టిక్ ద్రావణంతో బయటకు వేలాడుతున్న గర్భాశయాన్ని శుభ్రపరచి, వెన్నెముక మత్తు ఇచ్చి జాగ్రత్తగా యథాస్థానానికి అమర్చారు. తిరిగి బయటకు రాకుండా



కుట్లు వేసి తదుపరి వైద్యం అందించారు. చికిత్స అనంతరం మేక చురుకుగా నడుస్తూ ఇంటికి వెళ్లడంతో యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా డా. పెంటయ్య మాట్లాడుతూ గేదెలు, ఆవుల్లో గర్భాశయం బయటకు రావడం సాధారణమైనా మేకల్లో ఇది అత్యంత అరుదని చెప్పారు. తన 28 ఏళ్ల సేవలో మేకలో ఇలాంటి కేసు ఇదే తొలిసారి అని తెలిపారు. గర్భాశయ కండరాల బలహీనత, కాల్షియం--ఫాస్ఫరస్ లోపం, హార్మోన్లు, విటమిన్ లోపాల వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. చికిత్సలో సిబ్బంది చంద్రకళ, కర్ణ పాల్గొన్నారు.

# మౌనం వీడాలి.. లేక రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి : మంద కృష్ణ మాదిగ



**– రాజేష్ లాకప్ డెత్‌పై ఉత్తమ్ దంపతులపై విమర్శలు**

**కోదాడ/మునగాల, జనవరి 30 (సూర్యసేన) :** కర్ల రాజేష్ మరణంపై ఉత్తమ్ దంపతులు మౌనం వీడాలని, లేకపోతే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు రావాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ లాకప్ డెత్‌కు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ల రాజేష్ సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజేష్ మృతికి నూటికి నూరుశాతం పోలీసులే కారణమని, దీనికి సంబంధించిన సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. చట్టవిరుద్ధంగా కస్టడీలోకి తీసుకుని తీవ్ర చిత్రహింసలు పెట్టడం వల్లే రాజేష్ ఆరోగ్యం క్షీణించి మరణించాడని ఆరోపించారు. ఈ ఘటనకు చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి, కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం బాధ్యులని పేర్కొంటూ వారిని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఐపై చర్యలు తీసుకున్నప్పటికీ ఎస్సైను కాపాడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో మంత్రి ఉత్తమ్ దంపతులు మౌనం పాటించడం మాదిగ జాతికి అన్యాయమన్నారు. లాకప్ డెత్‌పై స్వతంత్ర విచారణ జరిపించాలని, సిట్ లేదా సీబీఐ లేదా హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ మరణానికి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 5న 'ఛలో సూర్యాపేట'కు పిలుపునిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మండల అధ్యక్షుడు కనకయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ 'పుర' పోరుకు 333 నామినేషన్లు



**కోదాడ ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** కోదాడ పురపాలక సంఘ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణకు విశేష స్పందన లభించింది. జనవరి 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియలో శుక్రవారం సాయంత్రం వరకు మొత్తం 333 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి 152, భారతీయ జనతా పార్టీ నుంచి 28, భారత రాష్ట్ర సమితి నుంచి 73, తెలుగుదేశం పార్టీ నుంచి 4, బహుజన సమాజ్ పార్టీ నుంచి 1, కమ్యూనిస్ట్ పార్టీ నుంచి 4, జనసేన పార్టీ నుంచి 7, స్వతంత్ర అభ్యర్థులుగా 64 మంది నామినేషన్లు వేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**– పోటెత్తిన అభ్యర్థులు..**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం కోదాడ మున్సిపల్ కార్యాలయం అభ్యర్థులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే వివిధ పార్టీల అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి భారీ ర్యాలీలుగా తరలివచ్చి నామినేషన్లు సమర్పించారు. గడువు ముగిసే సమయానికి నామపత్రాలు

దాఖలు చేసేందుకు అభ్యర్థులు పోటీ పడటంతో కార్యాలయ ఆవరణలో కోలాహలం నెలకొంది. ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.




# ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత సదస్సు...



**మోతే, జనవరి 30 (సూర్యసేన) :** సూర్యాపేట జిల్లా మోతే మండలం పరిధి ఉర్లుగొండ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో కర్కాయలగూడెం గ్రామపంచాయతీలో ఆర్థిక అక్షరాస్యత సాంకేతిక అక్షరాస్యత సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు సంబంధించిన పథకాలను వివరిస్తూ ప్రధానమంత్రి జీవనజ్యోతి ప్రధానమంత్రి సురక్ష బీమా ఎస్బిఐ జనరల్ మరియు ఏపీ వై స్కీము గురించి వివరించడం జరిగింది. అలాగే మహిళా సంఘాల గురించి పావుల వడ్డీ రాయితీ చెప్పడం జరిగింది బ్యాంకు సంబంధించిన సైబర్ క్రైమ్ లకు ఆధార్ ఓటిపి చెప్పొద్దని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందంతో మ్యాజిక్ షో జానపద పాటలు బ్యాంక్ స్కీముల గురించి సైబర్ నేరాల గురించి జాగ్రత్తగా ఉండమని ఈ కళాకారులు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మేనేజర్ ఎస్ శంకర్, ఎండి వహీద్, కళ విభూతి బ్రదర్స్, శ్రీనివాస్, రాజు, ఏడుకొండలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి ఆశీస్సులతో విజయం సాధిస్తా : యెర్నేని కుసుమ బాబు



**– 31వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్**

**కోదాడ ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** మున్సిపల్ ఎన్నికల్లో 31వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ సర్పంచ్ యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ పాలనలో తన అనుభవం, ప్రజాసేవే తన బలమని ఆమె తెలిపారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ఆశీస్సులు, మద్దతుతోనే బరిలోకి దిగుతున్నానని పేర్కొన్నారు. సర్పంచ్‌గా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలుసునని చెప్పారు. వార్డు ప్రజల సమస్యలపై స్పష్టమైన అవగాహనతో పారదర్శక పాలన అందించడమే లక్ష్యమన్నారు. స్థానిక ప్రజల ఆదరణతో విజయం సాధిస్తానన్న నమ్మకం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నామినేషన్‌కు ముందు ఆమె దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్



**నల్గొండ / సూర్యాపేట / జనవరి 30 (సూర్య సేన) :** ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 10,14,18.బాల, బాలికలకు చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గండూరి కృపాకర్, ఎల్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ బాల, బాలికలకు స్థానిక (టి. టి. డి )కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతి మరియు షీల్డ్స్, అందిఇస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగం క్రీడాకారులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. వివరాలకు ఎల్ సతీష్ కుమార్ కార్యదర్శి, చరవాణి నెం. 9394753343 సంప్రదించాలని తెలిపారు.

## సంపాదకీయం

**శనివారం, జనవరి 31, 2026**

### పర్యావరణ ప్రమాణాలు గాలికి..!

రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించడం లేదు. పైగా, ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్న డిమాండ్‌పై ఏకమవడం నూతన పరిణామం. ఉపాధి పేరుతో మోసగించి కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చాలన్న ప్రభుత్వ తాపత్రయానికి ప్రజా పోరాటాలు బ్రేకులు వేస్తున్నాయి. తమ ఆధీనంలోని పోలీసు బలగాలతో ప్రజలను భయపెట్టేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ప్రజల ఆగ్రహం ముందు అణచివేత, నిర్బంధ చర్యలు సాగవని జన సమూహాలు పాలకులను హెచ్చరిస్తున్నాయి. పరిశ్రమలకు ఒకనాడు భూములిచ్చిన రైతులు ఇపుడెందుకు ససేమిరా ఇవ్వమంటున్నారు? అన్న ప్రశ్నకు ప్రభుత్వాల దగ్గర జవాబులు లేవు. కానీ భూములిచ్చి, ఉపాధి లేక బతుకు తెరువుకు ఊరూవాడా తిరుగుతున్న రైతులు, పేదలు, మత్స్యకారులు, చేతివృత్తిదారులకు అనేక చేదు అనుభవాలున్నాయి. నేర్చుకున్న జీవిత పాఠాలు న్నాయి. గూడు కట్టుకున్న బాధలున్నాయి. ఈ క్రమంలోనే ప్రైవేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను నిరసన రూపంలో ప్రజాభిప్రాయ సేకరణలో తెలియజేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని సక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు వద్దంటే వద్దని ప్రజలు ఏక కంఠంతో చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోం ది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బ తీసి ప్రైవేటీకరించేం దుకు, స్థానికుల ఉపాధిపై ఊసెత్తని ఆర్సెలార్ మిట్టల్‌ను ప్రోత్సహించే ప్రభుత్వ కుట్రలను అర్థంచేసుకున్న ప్రజలు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో తమ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తుంటే, పెట్టి తీరాలని ప్రభుత్వం మొండిగా వుంది. పోలీసులను చూపి వెనక్కు తగ్గేలా చేయాలని ప్రభుత్వం చూస్తే, ఆ ఆలోచన విరమించుకొనేలా ఒత్తిడి పెంచాలని నిర్వాసితులు, బాధిత మత్స్యకారులు, ప్రజలు భావించారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంత పర్యటనకు వెళ్లిన మంత్రి వాహనం ముందు తాటిచెట్టు అడ్డంపెట్టి మరీ పోరాడారు. ప్రజాపోరాటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేస్తున్నట్టు మంత్రి ప్రకటించాల్సి వచ్చింది. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలంలో గంగవరం పోర్టు ఆవరణలో అదానీకి చెందిన అంబూజా సిమెంట్ గ్రైండింగ్ పరిశ్రమ ఏర్పాటుకు పెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సొంత నియోజకవర్గం గాజువాక పరిధిలోని పెదగంట్యాడ ప్రాంతంలో ప్రజలు తిరగబడ్డారు. అదానీ కొమ్ముగాసే ప్రభుత్వ ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని సిపిఎం, వామపక్షాలు ప్రజల పక్షాన నిలబడ్డాయి. అదానీకి చెందిన గంగవరం పోర్టు ధూళి, దుమ్ముతో భరించలేని కాలుష్యంతో బాధపడుతున్న ప్రజల్లో అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఆగ్రహం వెల్లువెత్తింది. రాష్ట్రంలో తీరప్రాంతం, సెజ్‌లో ఏర్పాటైన ఔషధ, రసాయన పరిశ్రమలతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు పీల్చే గాలి, తాగే నీరు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాంతక వ్యాధులకు అవి కేంద్రంగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను అటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశారు. కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధి పతులకు లాభాలు సమకూర్చడంపైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయి. ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకు తెచ్చి ప్రజలకు కనీస భద్రత లేకుండా చేసింది మోడీ, చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులు చట్టబద్ధ నియంత్రణలను పాటించాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. గాలిని, నీటిని కలుషితం చేస్తున్నా పట్టించుకోవడం మానేశాయి. చివరకు కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీల అధికారుల తనిఖీలపై ఆంక్షలు విధించి విచ్చలవిడితనానికి అవకాశం కల్పించాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన ఫ్యాక్టరీల జాబితాలో 386 పరిశ్రమలున్నట్లు 2023లో అధికార యంత్రాంగం గుర్తించింది. గత ఐదేళ్లలో 110 పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బ తీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్.టి.పి.సి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీకి అనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయి. పరిశ్రమలు వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా చెరువుల్లోకి విడిచిపెడుతున్నాయి.

సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048

# మత్తు.. బంధాలను చంపేస్తోన్న ముప్పు...



అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు ప్రయోజకులైతే ఆ తల్లిదండ్రులకి ఎంత సంతోషం! చదువులో చురుకుగా ఉన్న పిల్లలని చూసి మురిసిపోని అమ్మానాన్న ఎవరైనా ఉంటారా! విద్యార్థులు ఉన్నత స్థానాలకి ఎగబాకితే ఆ ఉపాధ్యాయులకి ఎంత గర్వకారణం! కానీ ఇప్పుడు చాలా కుటుంబాల్లో ఆ సంతోషం ఆవిరైపోతోంది. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభ మసకబారుతోంది. వ్యసనానికి బానిసైన కొడుకు వికృత చేష్టలు చూసి ఓ అమ్మ భయపడుతోంది. జేబులో పెట్టిన డబ్బులు మాయం చేస్తున్నది కొడుకని తెలిసి ఆ తండ్రి గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు. అన్నని చూసి చెల్లి, తమ్ముడిని చూసి అక్క రాత్రుళ్లు ఒంటరిగా నిద్రపోలేకపోతున్నారు. భార్యభర్తలు జీవితంలో కలలు కన్న అందమైన ప్రపంచం ఉన్నట్లుండి అదృశ్యమవుతోంది. బంధాలను ఇంతలా బీటలు వారిస్తున్న ఈ మత్తు.. మనిషిని కాదు, అతని గుణాన్ని నిట్టనిలువునా చంపేస్తోంది. మనిషితో ఉన్న ప్రతి సంబంధాన్ని నాశనం చేస్తోంది. గంజాయి రూపంలో వికటాట్టహాసం చేస్తున్న ఈ వ్యసనానికి బలౌతున్న కుటుంబాలు ఎన్నో.. ఒక కుటుంబం కరిగిపోయింది: మనోజ్ (పేరు మార్చాం) చదువులో చురుకైన విద్యార్థి. చెల్లి అంటే ఎంతో ప్రేమ. ఎప్పుడూ అమ్మతో పాటే ఉండేవాడు. కానీ కొన్ని రోజుల నుండి మనోజ్ ప్రవర్తన మారిపోయింది. 'ఒకసారి రుచి చూస్తే ఏమవుతుంది' అనుకుని సరదాగా మొదలుపెట్టిన గంజాయి వ్యసనం ఆ కుటుంబంలో పెద్ద కల్లోలం తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఆ కుటుంబంలో మునుపటి నవ్వులు లేవు. ఆటలు, సంతోషాలు లేవు. అంతా మౌనం.. మనోజ్ ఎవరితో మాట్లాడం లేదు. మౌనంగా తన గదిలో ఒంటరిగా గడుపుతున్నాడు. కొడుకులో వచ్చిన విపరీత ప్రవర్తన ఆ తల్లిదండ్రులకి కంటి నిండా నిద్రని దూరం చేసింది. బిడ్డ భవిష్యత్తు ఏమవుతోందని ఆ అమ్మానాన్న ఏడ్వని రోజు లేదు.

**పెద్ద కల.. ఛిద్రమైన జీవితం:** అవినాష్.. (పేరు మార్చాం) విశాఖపట్నం వాసి. ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారుల గారాల కొడుకు. ప్రముఖ టెక్నాలజీ కాలేజీలో అడ్మిషన్ కోసం విశ్వప్రయత్నం చేశాడు. అయితే ఎలా? ఎప్పుడు? మొదలైందో తెలియదు కానీ అతను డ్రగ్స్‌కి అలవాటు పడ్డాడు. ఈ వ్యసనం అవినాష్ లక్ష్యాన్ని నీరుగార్చింది. చదువులో ఏకాగ్రత తగ్గింది. దీంతో అమ్మానాన్న తమ పలుకుబడితో మేనేజ్‌మెంట్ కోటాలో సీటు సంపాదించారు. అయినా, వ్యసనం అవినాష్ చదువుని అర్ధాంతరంగా ముగించింది.

ఉద్యోగం ఉన్నా కుటుంబం దూరం: తిరుపతికి చెందిన రాజేష్ (అసలు పేరు కాదు) విద్యార్థిగా ఉన్నప్పుడు వ్యసనపరుడు కాదు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు డ్రగ్స్‌కి అలవాటుపడ్డాడు. కోవిడ్ టైంలో ఇంటి వద్ద నుండే పనిచేసే వీలున్నా రాజేష్ ఇంటికి రావడానికి ఇష్టపడలేదు. అక్కడే 'రూమ్‌లో ఉండి పనిచేస్తా' అన్నాడు. అమ్మానాన్నకి ఏదో అనుమానం వచ్చింది. ఒకరోజు ఉన్నట్లుండి రాజేష్ ఉంటున్న ఫ్లాట్‌కి వెళ్లారు. అక్కడ రాజేష్, అతని స్నేహితులతో కలిసి డ్రగ్స్ సేవించి మత్తులో జోగుతున్నాడు. ఈ దృశ్యం అమ్మానాన్నకి తీరని వేదన మిగిల్చింది.

**తాడేపల్లి విషాదాలు..:** గుంటూరు జిల్లా తాడేపల్లిలో అమ్మానాన్న, ఇద్దరు కొడుకులతో ఓ అందమైన కుటుంబం నివసిస్తోంది. కాలేజీకి వెళుతున్న పెద్ద కొడుక్కి గంజాయి అలవాటైంది.

పిల్లాడిలో వస్తున్న విపరీత ప్రవర్తనకి కలత చెందిన తండ్రి అనారోగ్యానికి గురై మరణిం చాడు. అతడు కన్నుమూసిన కొన్ని నెలలకే కొడుకుని మార్చలేక తల్లి కూడా ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడం, అన్న మత్తు పదార్థాలకి బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవడంతో స్కూల్లో చదువుతున్న తమ్ముడు, నానమ్మ ఇంట్లో తలదాచుకున్నాడు. వ్యసనం ఆ కుటుంబం మొత్తాన్ని చిన్నాభిన్నం చేసింది. తాడేపల్లిలోనే మరో రెండు కుటుంబాల్లో సమాజం సిగ్గుపడే సంఘటనలు జరిగాయి. తీరిక లేని పనితో ఉద్యోగాలు చేసుకుంటున్న తల్లిదండ్రులున్న ఆ కుటుంబాల్లో పిల్లలకి ఎప్పుడు? ఎలా అలవాటైందో తెలియదు డ్రగ్స్‌కి బానిసలయ్యారు. మత్తులో ఉన్న ఆ పిల్లలు వావి వరసలు మరిచిపోయి ప్రవర్తించారు. తోబుట్టువులు గర్భవతులయ్యేదాకా ఆ విపరీతం వెళ్లింది.

దొంగతనాలతో మొదలు: వ్యసనం మొదట ఆ వ్యక్తిని, తరువాత అతని కుటుంబాన్ని, చివరికి సమాజాన్ని నాశనం చేస్తోంది. పై సంఘటనలు కేవలం ఆయా కుటుంబాల్లో జరిగిన కొన్ని ఘటనలు. బయటికి రానివి కోకొల్లలు.

డ్రగ్స్ కోసం నాన్న జేబులో డబ్బులు దొంగిలించడంతో మొదలయ్యే నేరం తరువాతి రోజుల్లో బైకులు, స్నేహితుల సెల్‌ఫోన్లు, అమ్మ నగలు, చెల్లి వస్తువులు మాయం చేసేంతవరకు వెళుతోంది. కొన్నిసార్లు దొంగతనాలు, దోపిడీల నుండి హత్యలు,

అత్యాచారాలు చేసే తీవ్రరూపం దాల్చుతోంది. మత్తులో ఉండి తల్లిదండ్రులపై దాడి చేయడం, బంధువులతో, తోబుట్టువులతో అనుచితంగా ప్రవర్తించడం సాధారణంగా పరిగణించే స్థితికి సమాజం వచ్చేసింది. వ్యసనపరులైన విద్యార్థులతో టీచర్లు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కళ్ల ముందే ముక్కుపచ్చలారని పిల్లలు నాశనమైపోతుంటే ఆ ఉపాధ్యాయులు పడే బాధ వర్ణనాతీతం.

**గణాంకాలేం చెబుతున్నాయి?:** విజయవాడ, కృష్ణలంక, తాడేపల్లి పరిసర ప్రాంతాల్లో ఈమధ్య నమోదవుతున్న నేరాల్లో నిందితులు చాలావరకూ మాదకద్రవ్యాలు వినియోగించేవారే అని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. వ్యసనం బారిన పడిన వారు ఎదుటివారికి హాని చేయడమే కాదు, తమని తాము హింసించుకోవడానికీ వెనుకాడడం లేదు. ఈమధ్యకాలంలో వరుసగా జరిగిన ఆత్మహత్యల కేసుల్లో డ్రగ్స్ వినియోగించే వారివే అధికంగా ఉన్నాయని రికార్డుల్లో ఉంది. దేశంలో పట్టుబడుతున్న డ్రగ్స్ నిల్వల్లో అత్యధిక భాగం మన రాష్ట్రంలోనే నమోదవుతున్నాయి. అక్రమ రవాణానే కాదు వినియోగంలో కూడా ఆంధ్రప్రదేశ్ ముందుంది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కాకినాడ, విఖాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి నగరాల పరిసర ప్రాంతాల్లో నమోదయ్యే నేరాల్లో డ్రగ్స్ కేసులే ఎక్కువ. సులభంగా డబ్బులు సంపాదించవచ్చని యువత ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారు. మొదట విక్రయం, నెమ్మదిగా వినియోగం చేస్తున్నారు. ఫలితంగా నేరాలు పెరుగుతున్నాయి. డ్రగ్స్ ఒకరి జీవితాన్నే కాదు, అతని కుటుంబాన్ని, వారి ఆశలని నేలమట్టం చేస్తోంది. కూలిపోతున్న ఇంట్లో అమ్మానాన్న కన్నీళ్లు కారుస్తున్నారు. భయం గుప్పెట్లో తోబుట్టువులు కాలం వెల్లదీస్తున్నారు. భవిష్యత్తు తుడిచిపెట్టుకుపోతోంది. వ్యసనం తలుపుతట్టిన ఇంట్లో నవ్వులు మాయం అవుతున్నాయి. బంధాలు విరిగిపోతున్నాయి. ఇది మత్తు కాదు.. భవిష్యత్తు కలలని నాశనం చేస్తోన్న ఘోర ముప్పు.

# మంత్రిపదవిపై..దానం కన్ను..!

హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజకీయమే వేరు. ఎక్కడ అధికారం ఉంటే ఆయన అక్కడుంటారనేది పొలిటికల్ సర్కిల్స్తో పాటు..పబ్లిక్ టాక్. ఆ చర్చకు తగ్గట్లే2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్..కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే కారు పార్టీకి గుడ్ బై చెప్పి హస్తం పార్టీలో చేరిపోయారు. ఆ తర్వాత లోక్సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారు దానం. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిపాలవ్వడంతో దానం నాగేందర్కు కాంగ్రెస్ పార్టీ పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న చర్చ జరుగుతూ వస్తోంది. ఇదే సమయంలో పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు సీరియస్గా రియాక్ట్ కావడంతో ఇప్పుడు స్పీకర్ కఠిన నిర్ణయం తీసుకోబోతున్నారని అంటున్నారు.

మిగతవారి సంగతి ఎలా ఉన్నా దానం నాదేంగర్పై మాత్రం కచ్చితంగా అనర్హత వేటు పడుతుందన్న టాక్ వినిపిస్తోంది. పార్టీ ఫిరాయింపు ఎపిసోడ్లో దానం నాగేందర్పై అనర్హత వేటు పడితే నిబంధనల ప్రకారం..ఇమిడీయేట్గా ఆయన మళ్లీ పోటీ చేసే అవకాశం ఉండదని న్యాయ నిపుణులు చెబుతున్న మాట. అందుకే పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం తీసుకునేలోపే దానంతో రాజీనామా చేయిస్తారన్న చర్చ జరిగింది. కానీ కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో దానంలో టెన్షన్ మొదలైందట. అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి ఎమ్మెల్యే పదవికి రిజైన్ చేయడానికి రెడీ అంటూ ఆయనే స్వయంగా లీకులు ఇచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా అవకాశం



ఇవ్వాలని పార్టీ పెద్దల దగ్గర ప్రతిపా దన పెడుతున్నట్టు ప్రచారం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేయడానికి రెడీ అంటూ స్టేట్మెంట్లు ఇచ్చేశారు. అందుకు అనుగుణంగా తనదైన స్టైల్లో ఢిల్లీ లెవల్లో ప్రయత్నాలు చేశారు దానం. తనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో పాటు మం త్రివర్గంలో చోటు కల్పించాలని అధిష్టానం పెద్దల దగ్గర పైరవీ చేసినా అక్కడ పెద్దగా సానుకూల స్పందన రాలేదట.

దీంతో తన చేత రాజీనామా చేయిస్తారా, లేదంటే అనర్హత వేటు పడుతుందా అర్థం కాక తీవ్ర ఆందోళన చెందుతున్నారట దానం నాగేందర్. కాంగ్రెస్ పార్టీలోకి వస్తే తాను ఏదనుకుంటే అది చేయవచ్చని ఎంతో ఆశపడ్డ దానం నాగేందర్కు..హస్తం గూటికి చేరాక ఆగమాగం జగన్నా థం అన్నట్లు ఉందట పరిస్థితి. అధికార కాంగ్రెస్లో చేరి అధికారం చెలాయిద్దాం, అనుకున్నవన్నీ చేసేసుకుం దాం, మంత్రి అయిపోదాం అనుకుంటే..ఆఖరికి ఉన్న ఎమ్మెల్యే పదవి కూడా ఊడిపోయేలా ఉందే అని తెగ ఫీలైపోతున్నారట దానం. ప్రస్తుత పరిణామాలన్నింటినీ పరిశీలించాక ఆయన బాగా ఢీలా పడిపోయారన్న టాక్ వినిపిస్తోంది. చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసిన దానం..

ఏదీ వర్కౌట్ కాలేదని.. ఇప్పుడు సైలెంట్గా పార్టీ ఏం చెప్తే అది చేస్తానని..అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అంటూ చెప్పుకొస్తున్నారట. అంతే కాదు రాజీనామా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెప్పేశారు. ఫైనల్గా కాంగ్రెస్ పార్టీలో అప్పుడున్నట్లు కాదని..తానేదో అనుకుని బీఆర్ఎస్ను వదిలి హస్తం పార్టీలో చేరితే ఇక్కడ అంతా రివర్స్లో ఉందని వాపోతున్నారట దానం. పైగా అనర్హత విషయంలో స్పీకర్ ఏం నిర్ణయం తీసుకుంటారు, తర్వాత తన పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తం మీద తాను ఒకటి తలిస్తే మరొకటి జరుగుతుండటంతో.. పొలిటికల్ చౌరస్తాలో నిలబడ్డ పరిస్థితి అయిపోయిందని మధన పడుతున్నారట. ఫిరాయింపు ఎపిసోడ్లో దానంపై వేటు పడుతుందా లేక రిజైన్ చేస్తారా అనేది చూడాలి మరి.

# అమరావతికి అడ్డంకులు క్లియరైనట్టేనా..?

విజయవాడ,: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయడానికి కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించిన బిల్లును తిరిగి పంపిం చిందని కూడా వార్తలు వస్తున్నాయి. న్యాయపరమైన చిక్కులు, నిధులు సమస్యల కారణంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇంకా పార్లమెంట్ సమావేశాలు జరుగు తున్నాయని ఎప్పుడైనా బిల్లు ఆమోదం పొందవచ్చని అంటున్నారు. మొత్తానికి ఈ వార్త ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. అమరావతిని ఆంధ్రప్ర దేశ్‌గా నోటిఫై చేయించుకుంటే భవిష్యత్‌లో మార్పులు చేర్పులకు అవకాశం ఉండదని కూటమి ప్రభుత్వం భావి స్తోంది.రాష్ట్ర విడిపోయిన తర్వాత కమిషన్ వేసి అమరావతిని రాజ ధానిగా ఎంపిక చేసింది నాటి టీడీపీ ప్రభుత్వం. అయితే జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాజధా నిగా పెట్టేందుకు అంగీకరిం చలేదు. దీంతో మూడు రాజధానులు అంటూ సరికొత్త పల్లవి అందుకున్నారు. వివిధ కారణాలతో మూడు రాజధానుల వ్యవహారం కూడా ముందుకు సాగలేదు. తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడు రాజధానుల వాదనను ప్రజలు తిరస్కరించారు. 2024లో అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభు త్వం అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని స్పష్టం చేసింది. అక్కడ అభివృద్ధి పనుల కోసం వివిధ ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. కేంద్రం కూడా దీనికి ఓకే చెప్పింది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మళ్లీ మార్చకుండా ఉంటాయా అనే అనుమానం ఉంది. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి గందరగోళానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు కేంద్రమే ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేలా ప్రయత్నాలు చేస్తోంది.అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా నోటిఫై చేయాలని కేంద్రానికి కూటమి ప్రభుత్వం బిల్ పంపించింది. 2014 నుంచి గుర్తించాలని పేర్కొంది. ఇలా చేస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని కేంద్రం భావిస్తుందని అంటున్నారు. 2024 నుంచి గుర్తిస్తే అప్పటి వరకు చేసిన ఖర్చులపై కూడా న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పటికే పంపిన బిల్లును తిరిగి వెనక్కి పంపించారని అంటున్నారు. ప్రత్యామ్నా యాలతో బిల్లు పంపించాల ని సూచించినట్టు చెబుతున్నారు. తిరిగి వచ్చిన బిల్లుపై చంద్రబాబు సర్కారు న్యాయనిపుణులతో చర్చిస్తోందని అంటున్నారు. దీనికి పరిష్కార మార్గాలను కనుక్కునే పనిలో ఉన్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పూర్తి అయ్యే లోపుపంపిస్తే కేంద్రం అంగీకరించి సభలో ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు. లేకుంటే మళ్లీ బడ్జెట్ సమావేశాల వరకు ఎదురు చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై అటు కేంద్రం నుంచి కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు చేయలేదు. టీడీపీ వర్గాలు కూడా సైలెంట్‌గా ఉన్నాయి. కేంద్రానికి బిల్లు పంపిన సంగతిని మాత్రం ఇప్పటికే ప్రకటించారు. పీ క్యాబినెట్ మే 19, 2025న అమరావతిని రాజధానిగా గుర్తించే రెజల్యూషన్ ఆమోదించి, కేంద్రానికి పంపింది. ఈ రెజల్యూషన్‌లో 2014-2024 వరకు హైదరాబాద్ ఉమ్మడిరాజధానిగా ఉన్న విష యాన్ని పేర్కొంటూ, 2024 తర్వాత అమరావతిని ఏకైక క్యాపిటల్ గా చట్టచేయానలని కోరుతున్నారు. కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన ట్లుగా తెలుస్తోంది. కేంద్రం 2014చట్టం సెక్షన్ 5(2)ను సవరించే బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ బిల్లు అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ, భవిష్యత్ ప్రభుత్వాలు రాజధాని మార్చకుండా రక్షణ ఇస్తుంది.

# సూర్యాపేట ప్రజలు శాంతిని కోరుకుని, అభివృద్ధికి పట్టం కడతారు....



**– సూర్యాపేట జిల్లా కేంద్రంలో 34, 36 వార్డులకు నామినేషన్లు దాఖలు చేసిన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గండూరి ప్రవల్లిక ప్రకాష్ దంపతులు**

**సూర్యాపేట టౌన్, జనవరి 30 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణ ప్రజలు శాంతిని అభివృద్ధిని కోరుకుంటారని గత పదేళ్ల కాలంలో మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఓటేసి పట్టణంలోని 48 వార్డుల్లో బిఆర్ఎస్ను గెలిపిస్తారని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గండూరి ప్రవల్లిక ప్రకాష్ దంపతులు అన్నారు. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 34వ వార్డు నుంచి గండూరి ప్రకాష్, 36వ వార్డు నుంచి గండూరి ప్రవల్లికలు తమ నామినేషన్ పత్రాలను సమర్పించి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2014లో 11వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలిచిన తాము ఐదేళ్లు చైర్మన్గా ఉండి సూర్యాపేటను అభివృద్ధి చేయడంతో పాటు స్వచ్ఛభారత్లో అనేక అవార్డులు సాధించామన్నారు. 2020లో కౌన్సిలర్ గా 36వ వార్డు నుంచి బరిలో నిలిచి గెలిచామన్నారు. ప్రస్తుతం తిరిగి 2026 లో 34, 36వ కార్డుల నుంచి బి ఆర్ ఎస్ అభ్యర్థులుగా తాము బరిలో నిలుస్తున్నామని తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపాలిటీ అని 48 వార్డుల్లో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీమంత్రి జగదీష్ రెడ్డిలు చేసిన అభివృద్ధి 2014కు ముందు ఎలా ఉంది తరువాత ఎలా ఉంది అనేది ప్రజలు గ్రహించాలన్నారు. సూర్యాపేట పట్టణ ప్రజలు శాంతిని అభివృద్ధిని కోరుకుంటారని వారే ఓటేసి టిఆర్ఎస్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. 34, 36 వార్డుల ప్రజలకు తాము కుటుంబ సభ్యులుగా ఉండి సేవ చేస్తామని ఆయా వార్డుల ప్రజలు తమను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి



**– రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్**

**నల్గొండ కలెక్టరేట్, జనవరి 30 (సూర్య సేన) :** ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా ఇంటర్మీడియట్ , సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ ప్రాక్టీకల్స్ పరీక్షల పై సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి 11 వరకు ఉంటాయని,ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలోని 143 జూనియర్ కళాశాలల నుండి మొత్తం 9,251 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందులో జనరల్ విభాగంలో 6,092 మంది, వొకేషనల్ విభాగంలో 3,159 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే రెండవ సంవత్సరం విద్యార్థుల్లో ఎంపిసి లో 3,850 మంది, బైపిసి లో 2,016 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణ కు నల్గొండ జిల్లాలో మొత్తం 86 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో 57 జనరల్ జూనియర్ కళాశాలలు మరియు 29 వొకేషనల్ జూనియర్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా గుర్తించినట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఫ్లయింగ్ స్క్వాడ్స్ను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. విద్యార్థులు పరీక్ష విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు లేకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) సహకారంతో ప్రత్యేక బస్సు సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలకు సంబంధించిన పత్రాలు, రికార్డులు సకాలంలో చేరవేయడానికి స్పీడ్ పోస్టు సేవలను వినియోగించాలని చెప్పారు.పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని, అదనంగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు అనుకూల వాతావరణంలో పరీక్షలు రాయడానికి పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి దశ్రు ప్రిన్సిపల్స్ రాకేందు కుమార్ ,ధనరాజ్ ,పద్మ , శ్రీదేవి పాల్గొన్నారు.

# పెన్షనర్స్ మరణాలు --- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం



**భానుపురి, జనవరి 30 (సూర్య సేన) :** రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నుండి నాలుగు దశాబ్దాలపాటు సేవలందించిన వేలాది మంది పెన్షనర్లు, 2021 మార్చి తరువాత స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన వారు,మరణించినవారు అలాగే 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉపాధ్యాయులు--ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు అందక తీవ్ర ఆర్థిక, ఆరోగ్య, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పిల్లల పెళ్లిళ్లు చేయలేక, ఇంటి లోన్స్ మరియు ఇతర అప్పులు తీర్చలేక, అవసరమైన వైద్య చికిత్సలు పొందలేక, నెలనెలా వచ్చే పెన్షన్ మొత్తాన్ని వడ్డీలకే చెల్లిస్తూ, కుటుంబ నిత్యావసరాలకు డబ్బులు లేక, ఎక్కడా అప్పు దొరకక ఇప్పటివరకు 54 మందికి పైగా పెన్షనర్లు గుండెపోటు, ఆత్మహత్యలతో ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనం. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షనర్స్ బకాయిలను విడుదల చేసి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు పెన్షనర్స్ బకాయిలు, డిఎలు, పిఆర్సీ వంటి ప్రయోజనాలను సమయానికి చెల్లిస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా పెన్షనర్స్కు రావాల్సిన బకాయిలను ఆలస్యం చేయకుండా చెల్లిస్తున్నాయి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొండి వైఖరిని అవలంబిస్తూ, తప్పుడు ప్రకటనలు చేస్తోంది. నెలనెలా 700 కోట్లు పెన్షనర్స్కు ఇస్తున్నామని చెప్పడం వాస్తవానికి దూరం. అందులో కనీసం వంద కోట్లు కూడా పెన్షనర్స్ బకాయిలుగా అందడం లేదు. పెన్షనర్స్, ఉద్యోగులను కావాలనే ఇబ్బంది పెడితే దాని ఫలితం ఏమిటో ప్రభుత్వం తెలుసుకోవాలి. అందుకు బాధితులు, వారి బంధుమిత్రులు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 100% ఓటింగ్ ద్వారా తమ శక్తిని చాటాలని కోరుతున్నాము. సేవలు చేయించుకొని బకాయిలు చెల్లించని ప్రభుత్వానికి పెన్షనర్స్ కుటుంబాల ఆవేదన అర్థమయ్యేలా చేయాలి. నేటి పెన్షనర్స్ కూడా నిన్నటి వరకు సంఘాల నాయకులే అన్న విషయాన్ని నేటి సంఘ నాయకులు మరవకూడదు. నేటి ఉద్యోగులు రేపటి పెన్షనర్స్ అన్న విషయాన్ని గుర్తుంచుకొని, ప్రభుత్వం పెన్షనర్స్ బకాయిలు చెల్లించే వరకు ఉద్యోగ--ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా పోరాడాలని తీకుళ్ళ సాయిరెడ్డి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు.

# ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో నమోదైన హత్యాప్రయత్నం కేసుపై తప్పుడు ప్రచారం....

**– సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్న ఏ1 నిందితుడు రౌడీ షీటర్ పై చట్టపరమైన చర్యలు**

**– సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్**



**సూర్యాపేట రూరల్ / ఆత్మకూర్ (ఎస్), జనవరి 30 (సూర్య సేన):** ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధి నవంబర్ 18 వ తారీఖున హత్యాప్రయత్నంకు సంబంధించి బాధితుడు జటంగి రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాప్రయత్నం కేసు నమోదు చేయడం జరిగినది. పారదర్శకంగా దర్యాప్తు జరిపి ఈ కేసులో కొంత మంది నిందితులపై కేసు నమోదు చేయడం జరిగినది. బాధితుడు పిర్యాదు ఆధారంగా ఆత్మకూరు మండలం పాతర్లపాడ్ గ్రామానికి చెందిన ఏ1 జటంగి సురేష్, ఏ2 బండపల్లి విఘ్నేష్, ఏ3 మహేందర్ అనే ముగ్గురిని ప్రాథమిక నిందితులుగా గుర్తించడం జరిగింది.

ఇందులో నిందితుడు ఏ2 విఘ్నేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తలరిలించగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఏ1 జటంగి సురేష్ పై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు గతంలో రౌడీషీట్ నమోదై ఉన్నది. ఏ1 నిందితుడైన జటంగి సురేష్ తనపై తప్పుడు కేసు నమోదు చేశారని, బెయిల్ ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించగా గౌరవ హైకోర్టు నిందితుడి పిటిషన్ కొట్టివేయడం జరిగింది. హత్యాప్రయత్నం కేసు దర్యాప్తులో ఉండగా పరారీలో ఉన్న ఏ1 నిందితుడు జటంగి సురేష్ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ఈ కేసు పై, ఆత్మకూరు పోలీస్ పై, ఎస్సై శ్రీకాంత్ పై అసత్య ప్రచారాలను చేస్తూ పోస్టులు పెడుతున్నాడు, ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు. కేసుకు సంబంధించిన వాస్తవాలను తప్పుదోవ పట్టించేలా, పోలీసు ప్రతిష్టను కించపరిచేలా పోస్టు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన...



**నల్గొండ, జనవరి 30 (సూర్య సేన) :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు గాను అనువైన కేంద్రాన్ని చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఉన్న ఎస్ డబ్ల్యు సి గోదామును మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకై పరిశీలించారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న 6 మున్సిపాలిటీలు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు అనువుగా ఉండాలని ,ప్రతి మున్సిపాలిటీకి ఒక కౌంటింగ్ హాల్ తో పాటు, స్ట్రాంగ్ రూమ్, సీలింగ్ రూమ్ తదితర సౌకర్యాలు ఉండాలని, ఆ విధంగా అధికారులు ఓట్ల లెక్కింపు కేంద్రాలను చూడాలని చెప్పారు.ఆర్జాల బావి ఎస్ డబ్ల్యు సి గోదాం తో పాటు ,ఇంకా ఏవైనా అనువైన భవనాలలో ఓట్ల లెక్కింపుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డిని ఆదేశించారు. ముఖ్యంగా అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపుకు అనువైన విధంగా హాల్స్, పోటీ చేసిన అభ్యర్థులు,ఓట్ల లెక్కింపు సిబ్బంది అందరికీ సౌకర్యంగా ఉండేలా రవాణా సదుపాయం అన్నింటిని దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,ఎస్ బ్ల్యుసి రీజనల్ మేనేజర్ వీరమల్లు, మేనేజర్ మురళి ,మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర, స్థానిక తహసిల్దార్ పరశురాం, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# కీతవారిగూడెంలో మహాశివరాత్రి మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



**గరిడేపల్లి ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** గరిడేపల్లి మండలంకీతవారిగూడెం గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం మహాశివరాత్రి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలనే సంకల్పంతో దేవాలయ అధ్యక్షుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, శివభక్తులు శివదీక్షలు చేపట్టారు. ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం జరగనున్న మహాశివరాత్రి మహోత్సవానికి దేవాలయాన్ని సర్వాంగసుందరంగా సిద్ధం చేస్తున్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు, అన్నదానం, కళ్యాణోత్సవ ఏర్పాట్లను గ్రామోత్సవాన్ని తలపించేలా నిర్వహించాలనే లక్ష్యంతో కమిటీ ఏర్పాట్లను వేగవంతం చేసింది.

దేవాలయం మరియు పరిసర ప్రాంగణాన్ని రంగురంగుల రంగవల్లులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నారు. ఈ మహోత్సవానికి సుమారు పాతికవేల మంది భక్తులు దర్శనానికి తరలివస్తారని అంచనాతో భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు దేవాలయ అధ్యక్షులు, ప్రధాన అర్చకులు రాయప్రోలు శ్రీరామయ్య శర్మ తెలిపారు. ఈ ఏర్పాట్ల పర్యవేక్షణలో దేవాలయ ఉపాధ్యక్షులు బాల్దూరి అంజయ్య, ప్రధాన కార్యదర్శి గుండు సైదయ్య, కార్యదర్శి రుద్ర వెంకటేశ్వర్లు, కోశాధికారి జుట్టుకొండ చంద్రయ్యతో పాటు ఇతర కమిటీ సభ్యులు నిత్యం పాల్గొంటున్నారు.

# ప్రదోష ఘడియల్లో నందీశ్వరునికి దివ్యాభిషేకం



**– మేళ్లచెరువులో శంభులింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల పూజలు**

**మేళ్లచెరువు ప్రతినిధి, జనవరి 30 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు గ్రామంలోని శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర స్వామి వారి సన్నిధిలో శుక్రవారం శుక్ర ప్రదోషం సందర్భంగా నందీశ్వరునికి అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. ప్రదోషకాలంలో శివారాధన చేయడం ద్వారా జాతక, పితృ దోషాలు నివారించబడతాయని అర్చకులు తెలిపారు. నందీశ్వరునికి అభిషేకం చేస్తే సర్వ దోషాలు తొలగుతాయనే విశ్వాసంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్ శర్మ అర్చక బృందంతో కలిసి అభిషేకం, పంచ హారతులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం కనుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి నాగేళ్ల శంబిరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు బారెడ్డి వెంకట్ రెడ్డి, నక్క రామకృష్ణ, సిహెచ్. దేవమణితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు ఎత్తి వేయాలి



**తుంగతుర్తి ప్రతినిధి, జనవరి 30 (సూర్య సేన) :** సిట్ విచారణ పేరుతో మాజీ ముఖ్య మంత్రి కేసిఆర్ నోటిస్ ఇవ్వడాన్ని నిరసిస్తూ తుంగతుర్తి మండల కేంద్రం లో సీఎం దిష్టి బొమ్మ ను బిఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ ఏం. పి.పి తాటికొండ సీతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం లో వచ్చిన రెండు సంవత్సరాలుగా ఫోన్ ట్యాపింగ్ పేరుతో హరీష్ రావు. కేటీఆర్ సంతోష్ లతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను వేధించడా న్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.. అధికారం రావడానికి ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్. మాజీ వైస్ ఏం.పి పి లు మట్టిపెల్లి శ్రీశైలం. దొంగరి శ్రీనివాస్..సర్పంచ్ లు. శ్రీనివాస్ రెడ్డి. మనోజ్. రమేష్. కర్ణాకర్ మండల నాయకులు. మల్యాల రాములు. గుడిపాటి వీరయ్య. కదారి దాసు.గోపగాని రమేష్ మట్టిపెల్లి వెంకట్. సోమేశ్. యాకూబ్.. గునిగంటి యాదగిరి.. తునికి లక్ష్మి. గోపగాని శ్రీనివాస్. తడకమళ్ల రవి.. మల్లేష్..బొజ్జ సాయికిరణ్. వెంకటేష్ భాస్కర్. మహేందర్. గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలి



**భానుపురి, జనవరి 30 (సూర్య సేన) :** అహింస మార్గాన్ని ఆయుధంగా చేసుకొని భారతదేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిపెట్టిన మహాత్ముడు మహాత్మా గాంధీ అని శ్రీ వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మ గాంధీ విగ్రహానికి శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. ఒక చెంప కొడితే రెండో చెంప చూపించమని అహింసా మార్గాన్ని ఎంచుకొని శాంతియుతంగా స్వాతంత్రాన్ని సంపాదించిన ఘనత మహాత్మా గాంధీకే దక్కుతుందన్నారు. మహాత్మా గాంధీ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ఆయన ఆశయాలను సాధించడంలో నేటి యువత ముందుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవాసమితి ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు కోశాధికారి సోమా ప్రవీణ్ కుమార్ ఉపాధ్యక్షులు మిర్యాల సుధాకర్, కుంచపర్తి రాజశేఖర్, సహాయ కార్యదర్శులు తప్పీ అనిల్ కుమార్ , బచ్చు శ్రీనివాస్ సభ్యులు శ్రీరంగం రాము, వందనపు వెంకటేశ్వర్లు, దేవర శెట్టి సోమయ్య,మంచాల శ్రీనివాసు,తల్లాడ శ్రీనివాస్, గుండా శ్రీధర్, వెంపటి శబరినాథ్,మిట్టపల్లి రమేష్ , నూనే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం... రమణీయం... శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



**గరిడేపల్లి, జనవరి 30 (సూర్యసేన) :** మండల కేంద్రం గరిడేపల్లిలో శుక్రవారం వెంకటేశ్వర స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగగా, స్వామివారికి ఎదుర్కోళ్ళు కార్యక్రమాన్ని మహిళా భక్తులు భక్తి భావంతో నిర్వహించారు.

అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య అర్చకులు వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం కళ్యాణ వెంకటేశ్వర స్వామిని మేళతాళాల మధ్య పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండెం శ్రీనివాస్ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బండ నర్సిరెడ్డి, మాజీ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్, ఆలయ అర్చకులు సుదర్శన శ్రీనివాసాచార్యులు, సుదర్శన ఫణి ఆచార్యులు, సుదర్శన రాజన్ ఆచార్యులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి అనుగ్రహం పొందారు.

# సమ్మక్క--సారక్కల ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**– అన్నదానం మహాదానం.. జాతర నిర్వాహకులకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అభినందనలు**



**కోదాడ ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** తెలంగాణ మహా కుంభమేళాగా పిలువబడే సమ్మక్క--సారక్క జాతర సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానం మహాదానమని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో సుభీక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ బొల్లం మల్లయ్య యాదవ్ ఆకాంక్షించారు. కోదాడ పట్టణ పరిధిలోని 30వ వార్డులో జరుగుతున్న సమ్మక్క--సారక్క జాతరలో శుక్రవారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతర వేళ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమిటీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# 46 వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మొరిశెట్టి నివేదిత నామినేషన్

**భానుపురి, జనవరి 30 (సూర్య సేన) :** 46 వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శుక్రవారం మొరిశెట్టి నివేదిత నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేట అభివృద్ధి కి కాంగ్రెస్ పార్టీ నీ గెలిపించాలని తెలిపారు. వీరి వెంట మొరిశెట్టి లక్షాది,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ లు ఉన్నారు.



# వేణుగోపాలుడి సన్నిధిలో భక్తి వెల్లువ....



**– అధ్యయనోత్సవాల్లో మూడో రోజు విశేష పూజా కార్యక్రమాలు**

**హుజూర్నగర్ ప్రతినిధి, జనవరి 30 (సూర్యసేన) :** స్థానిక శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా మూడవ రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయంను పల్లకి సేవ, ఆయుధ ప్రబంధ సేవ నిర్వహించగా, అనంతరం చతుర్వేదాలు, గీత, రామాయణ, భాగవత, ద్రావిడ వేద పారాయణాలు ఘనంగా సాగాయి. సాయంత్రం పరమపదోత్సవం అనంతరం నివేదన, నీరాజనం, మంత్రపుష్పాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రేపు మధ్యాహ్నం శ్రీ స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు--పెండ్లి కుమార్తె అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం సాయంత్రం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి ఊరేగింపుగా బయలుదేరి ఫణిగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి కొండపైకి చేరుకుంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, స్థానాచార్యులు ముడుంబ శ్రీనివాసాచారులు, ప్రధాన అధ్యాపకులు నల్లాన్ చక్రవర్తుల బదరీ నారాయణాచార్యులు, ముడుంబ జగన్నాధాచార్యులు, ఆలయ అర్చకులు నరగిరినాధుని నర్సింహాచార్యులు, రంగ భట్టరాచార్యులు, భాస్కరాచార్యులు, మురళీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. అలాగే భక్తులు కోటా సూర్యప్రకాశ్ రావు, గుండా రమేశ్, పొనుగుబాటి అశోక్, వెంకటేశ్వరావు, కాంతయ్య, పశ్య పిచ్చమ్మ, వెన్న పద్మ, భారతమ్మతో పాటు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు.

# ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ...



**– భావోజు సిద్దేశ్వర చారి...**



**రంగారెడ్డి, జనవరి 30 (సూర్య సేన) :** చార్మినార్ లో చార్ కమాన్ స్వర్ణకారులసంఘం(హైదరాబాద్)కార్యాలయంలో జనవరి 29న నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ మరియు ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మశ్రీ కిరణ్ కుమార్ ఆచార్య (ఏసిపి), ముఖ్య అతిథులుగాస్వర్ణకార రాష్ట్రఅధ్యక్షులువింజమూరిరాఘవాచారి, భావోజు సిద్దేశ్వర చారి, సన్నీ రాజ్ చారి, భావోజు శ్రీకాంత్ , మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ముగిసిన నామినేషన్ల పర్వం



**సూర్యాపేట, జనవరి 30 (సూర్య సేన) :** మూడు రోజు ల పాటు జరిగిన నామినేషన్ల కార్యక్రమం శుక్రవార ం సాయంత్రం 5 గంటలకు ముగియడంతో మున్సిపల్ కార్యాలయం మెయిన్ గేట్ కు తాళం వేసిన ఎన్నికల అదికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు నామినేషన్ల కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో హర్షం వ్యక్తం చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీలో మొత్తం నామినేషన్లు 741 దాఖలు

| | |
|---|---|
| టిఆర్ఎస్ | 189 |
| కాంగ్రెస్ | 249 |
| బిజెపి | 83 |
| టి ఆర్పి | 41 |
| ఇతరులు. | 179 |
| మొత్తం. | 741 |

# ఆత్మవిశ్వాసమే...అభివృద్ధికి ఆయుధం



ఆత్మ విశ్వాసమే అసలైన ఆస్తి
నీవిశ్వాసమే జీవితానికితోడునీడ
గుండెల్లోచెక్కుచెదరని విశ్వాసం
నీవిజయానికి పరమపదసోపానం

నీమీద నీకువిశ్వాసం నిన్ను
వీరున్నిచేస్తుందినీవిశ్వాసమే
నీకున్న గొప్ప బ్రహ్మాస్త్రం
నీవిశ్వాసమే నీరక్షణ కవచం

నీ జీవితం ఇతరుల చేతుల్లో
పరిస్థితుల చేతుల్లో లేదు
నీచేతుల్లోనే ఉంది

నీ భావిజీవితానికి నీవే కర్త కర్మ
క్రియ నీ చేష్టలకు నీవే రాజువు
నీవే భంటువు సాకులు వెతుకకు
సానుకూలత పెంచుకో
సక్సెస్ సాధించుకో

చెల్లని రూపాయికి గీత లెక్కువ
చేతగాని వానికి మాట లెక్కువ
సముద్రంలో పడిలేసే కెరటం
నీకు ఆదర్శం కావాలి
నిరాశ నిస్పృహ వీడాలి
లక్ష్య సాధకుడవై సాగిపోవాలి
చేవ చచ్చి చేతగాని వానిగా
బతికే కంటేతెగించి ముందడుగేయి
విజయంనీవశ మౌతుంది
నిన్ను నీవు నమ్ముకోఒకరి మెప్పు
కోసంఎవరినో ఒప్పించడానికో
ఎవరి భయం కోసమో
ఎవరి కోసం నీవుకష్టపడకు
నీకోసం నీవు కష్టపడు

ఎవరో వస్తారనిఏదో చేస్తారని
ఎదిరి చూసి మోసపోకు
ఒళ్లు మరిచి నిద్ర పోకు
కలలు కనకుఒళ్లంచి కష్టపడు
అడ్డ దారులు తొక్కే వారిని
కష్టం లేకుండరాత్రికి రాత్రి పేరు
ప్రఖ్యాతులు పొందిన
వారిని ఆదర్శంగా తీసుకోకు
నీకు నీవే ఆదర్శంనీకు నీవే సాటి
నీవు ఎవరిని ఆదర్శంగా
బావిస్తావో తెలిస్తే నీ వ్యక్తిత్వం
తెలిసి పోతుంది

సులభ జీవితం వద్దు
కష్టపడే జీవితమే ముద్దు
కష్టపడే తత్వమే
నీ ఇష్ట దైవం కావాలి

ఇతరులను శాసించకు
ఇతరుల నుండి ఆశించకు
అంచనాలు మానుకో
ఆందోళన తుంచుకో
ఎవడో విలువ ఇవ్వలేదని
చింతించడం మానుకో
నీకు నీవే చైతన్య శక్తిగా
సాగిపో

నీ ఆలోచనలునీసంకల్పాలు
నీ కష్ట సుఖాలు ఇతరులకు
తెలువాల్సినఅవసరం లేదు
ఇతరుల పై ఆశలు వద్దు
నిరాశను వీడుఆశా జీవిగా సాగిపో

కష్టాల్లో ఉన్నపుడునీ పై రాళ్ళు వేసి
నిన్ను కుంగ తేసే వారే ఎక్కువ
నీకుంగు బాటునుతగ్గించి లక్ష్య
సాధనకుసహకరించే వారు
లేరని బాధపడకు

నీ బాదలుతీర్చే వాడే నీ ఆప్తుడు
నీ లక్ష్యాలుసంకల్పంసంతోషం
కష్టాలు అర్థం చేసుకునే వారు
నీకు లేకపోయినానీకు నీవే తోడు
నీకు నీవే ధైర్యంనీకు నీవే
సంకల్పంనీకు నీవే జీవితాన్ని
డిజైన్ చేసుకోఅనుకరణ వద్దు
అనుభవమే హద్దు
స్వయం ప్రేరణే ముద్దు
ఎవడో అడ్డుకుంటాడని
ఎవడో ఆపేస్తాడని
కుంటి సాకులు మానుకో
కష్ట పడే అర్హత వుంది
శరీరంలో సత్తువ వుంది

కృషి ఉంటే మనుషులు
ఋషులౌతారు
పేపర్ బాయ్ గా
పనిచేసిన అబుల్ కలాం
దేశాధ్యక్షుడయ్యాడు
టీ అమ్మిన నరేంద్ర మోడీ
దేశానికి ప్రధాని అయ్యాడు

కనీస వసతులు లేకున్నా
కష్టాలనే ఇష్టాలుగా మార్చుకో
పనీయే నీ దైవం కావాలి
కాలే కడుపుతో కదులుముందుకు
ఉద్యమాల కోసం దీక్షలు చేసే
వారి కన్ననీ ఉజ్వల భవిష్యత్తు
కోసం నీవు ఉండే పస్తులు
నీభావి ప్రగతికి పురోగతికి
మెట్లు కావాలి

పనియేదైవంగా కష్టమే
నీఇష్టంగా పట్టుదలే
పెట్టుబడిగా ప్రగతియే
ఫలితంగా సంతృప్తియే
సంపదగా
సంతోషమే సౌభాగ్యంగా
సంకల్పమే నీజీవిత
కరదీపిక కావాలి
ఆత్మవిశ్వాసమే అభివృద్ధికి
ఆయుధం కావాలి .

**నేదునూరి కనకయ్య**
**రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక**
**ఫ్రీలాన్స్ జర్నలిస్టు' కవి రచయిత**
**కరీంనగర్**
**944024577**

# అమరుడు కల్నాల్ సంతోష్ తల్లి బికుమళ్ళ మంజుల ఉపేందర్ నామినేషన్ దాఖలు

**భానుపురి, జనవరి 30 (సూర్య సేన) :** సూర్యాపేట మున్సిపాలిటీ 44 వ వార్డు అభ్యర్థిగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుడు కల్నాల్ సంతోష్ తల్లి బికుమళ్ళ మంజుల ఉపేందర్ నామినేషన్ దాకలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ఎనలేని అభివృద్ధితో కెసిఆర్ పాలన తీరును, గత పదేండ్లలో మాజీమంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నాయకత్వంలో సూర్యాపేటలో ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎనలేని అభివృద్ధిని ఆమె కొనియాడారు. అటువంటి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్దిగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పోటీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



# ఊహించని రీతిలో తగ్గిన బంగారం, వెండి ధరలు



**హైదరాబాద్, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** కొన్ని నెలలుగా ఊహకందని రీతిలో పెరిగిన బంగారం, వెండి ధరలు నేడు భారీగా తగ్గాయి. నిన్నటికి నిన్న 10 గ్రాముల బంగారం ధర ఒక్కసారిగా రూ.11000 మేర పెరగ్గా.. శుక్రవారం ఉదయం, సాయంత్రం భారీగా తగ్గింది. ఒక్కరోజే తులం బంగారం ధర రూ.11,000 మేర తగ్గింది. దీంతో శుక్రవారం సాయంత్రానికి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,69,200కు దిగొచ్చింది. జీఎస్టీతో కలిపి హైదరాబాద్ లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,73,000 వరకూ ఉంది. కొద్ది రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోన్న వెండి ధర ఒక్కరోజులోనే భారీగా పతనమయింది. శుక్రవారం కేజీ వెండి ధర ఏకంగా రూ.59 వేలు పతనమయింది. ప్రస్తుతం హైదరాబాద్ లో కేజీ వెండి ధర రూ.3,48,000కు తగ్గింది. బంగారం, వెండి లోహాలపై పెట్టుబడులు సేఫ్ అని భావించి ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టడం, ఈవీ, సోలార్ ప్యానల్స్ లో వెండికి డిమాండ్ పెరగడంతో ఊహకందని రీతిలో పెరిగాయి. రెండ్రోజుల్లో బడ్జెట్ 2026ను పార్లమెంట్లో ప్రవేశ పెట్టనుండగా.. మార్కెట్లలో భారీ హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ఇన్వెస్టర్లు లాభాలను తీసుకోవడంతో ఒక్కరోజులోనే రూ.5 లక్షల కోట్ల బంగారం సంపద ఆవిరైంది. బడ్జెట్ తర్వాత వాటి ధరలు తగ్గుతాయన్న ఊహాగానాల నేపథ్యంలోనే ఇన్వెస్టర్లు లాభాలను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గురువారం ఈ భారీ హెచ్చుతగ్గులు కనిపించగా.. కాసేపటికి కోలుకున్నట్లు స్టాక్ మార్కెట్ నిపుణులు వెల్లడించారు. నేడు కూడా బంగారం, వెండిపై లాభాలను స్వీకరించడంతో ధరలు భారీగా తగ్గినట్లు చెప్తున్నారు.

## మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా

# సీఎం రేవంత్ రెడ్డి నివాళి




**హైదరాబాద్, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి):** నేడు భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహాత్ముని త్యాగాలను, ఆశయాలను స్మరించుకున్నారు. సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో బాపు దేశానికి చేసిన సేవల్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతించగా, హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపూ ఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'అహింసనే ఆయుధంగా స్వాతంత్ర్య సంగ్రామాన్ని జయించి.. ప్రపంచా నికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసిన వ్యక్తి మహాత్ముడు.

# దక్షిణాసియాకు 3,300 విమానాలు అవసరం




ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): రాబోయే రెండు దశాబ్దాల్లో భారతదేశంతో పాటు దక్షిణ ఆసియా ప్రాంతంలో విమాన ప్రయాణికుల రద్దీ అత్యంత వేగంగా పెరగనుందని అంతర్జాతీయ విమానయాన దిగ్గజం బోయింగ్ అంచనా వేసింది. బోయింగ్ తన 'కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్' నివేదికను బుధవారం వింగ్స్ ఇండియా ప్రదర్శనలో విడుదల చేసింది. ఆ వివరాలు.. 2044 నాటికి దక్షిణాసియాలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సుమారు 3,300 కొత్త విమానాలు అవసరమవుతాయని వెల్లడించింది. పెరుగుతున్న మధ్యతరగతి జనాభా, ఆర్థిక విస్తరణ, విమానాశ్రయాల మౌలిక సదుపాయాల కల్పనలో వస్తున్న మార్పులు విమానయాన రంగాన్ని ఏటా 7 శాతం పెరిగేలా చేస్తోందని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు అంచనా వేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 795 విమానాలు ఉండగా, ఇవి రాబోయే 20 ఏండ్లలో దాదాపు నాలుగు రెట్లు పెరిగి 2,925కు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో 90 శాతం విమానాలు స్వల్ప, మధ్యస్థ దూర ప్రయాణాలకు అనుకూలమైన సింగిల్-ఐసిల్ రకానికి చెందినవే ఉంటాయని తెలిపింది. ఈ భారీ విస్తరణకు తోడుగా విమానయాన రంగంలో మెయింటెనెన్స్, శిక్షణ వంటి సేవల కోసం 195 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. అలాగే సుమారు 1,41,000 మంది పైలట్లు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బందికి కొత్తగా ఉపాధి లభిస్తాయని అంచనా వేశారు.

## బంగారం ధర ఆల్‌టైమ్ రికార్డ్.. 10 గ్రాములు ఏ రూ.1,78,850

ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): గోల్డ్ లవర్స్‌కు ఊహించని షాక్ తగులుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు మునుపెన్నడూ లేని విధంగా భారీగా పెరిగి ఆల్ టైమ్ రికార్డుకు చేరాయి. తాజాగా హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ బంగారం ధర భారీగా పెరిగి ఆల్ టైమ్ రికార్డుకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.11,770 పెరిగి రూ.1,78,850కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.10,800 ఎగబాకి రూ.1,63,950 పలుకుతోంది. మరోవైపు కేజీ వెండి ధర రూ.4,25,000 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా4 గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5,500 డాలర్ల మార్కును దాటింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితి వల్ల ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపడంతో బంగారం ధరలు విపరీతంగా పెరిగాయి. ఇక భారత్‌లో పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ స్థాయిలో ధరలు పెరగడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. కేవలం బంగారం ధర మాత్రమే కాకుండా, అందుకు తోడు 3 శాతం జీఎస్టీ, షాపుల వారీగా తయారీ కూలి అదనంగా ఉండటంతో వినియోగదారులపై తీవ్ర భారం పడుతోంది.



## భారతీయ వాహనాలపై 50 శాతం సుంకం విధించే యోచనలో దక్షిణాఫ్రికా



ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): భారత్, చైనా నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై 50 శాతం వరకు సుంకాలను విధించే అంశాన్ని దక్షిణాఫ్రికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పెరుగుతున్న వాహనాల దిగుమతుల వల్ల స్థానిక ఆటో తయారీ పరిశ్రమపై పడుతున్న ప్రభావాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నిర్ణయం ఆ దేశ ట్రేడ్, ఇండస్ట్రీ, కాంపిటీషన్ డిపార్ట్‌మెంట్ సమీక్ష పరిధిలో ఉంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, కీలక ఎగుమతి మార్కెట్లుగా ఉన్న భారత్, చైనా నుంచి వాహనాలను నిలువరించేలా మార్గాలను గుర్తించేందుకు ఒక అంతర్గత సమీక్ష జరిగింది. ఈ రెండు దేశాల నుంచి జరిగే దిగుమతులు దక్షిణాఫ్రికా వాహన పరిశ్రమ పోటీతత్వాన్ని దెబ్బతీస్తున్నాయని అక్కడి అధికారులు భావిస్తున్నారు. డిపార్ట్‌మెంట్ అధికారులు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలైన భారత్, చైనాకు సంబంధించి ప్రపంచ వాణిజ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా దిగుమతి సుంకాలను పరిశీలిస్తోంది. ఇటీవలి డేటా ప్రకారం, భారత్, చైనా దక్షిణాఫ్రికాకు రెండు అతిపెద్ద వాహన ఎగుమతిదారులుగా అవతరించాయి. 2024లో మొత్తం వాహన దిగుమతులలో భారత్ 53 శాతం, చైనా 22 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ స్థాయి దిగుమతుల వల్ల స్థానిక వాహన పరిశ్రమకు నష్టాలు ఎదురవుతాయని దక్షిణాఫ్రిక అభిప్రాయపడింది.

అంతేకాకుండా, గత నాలుగేళ్ల కాలంలో చైనా నుంచి ఆ దేశానికి ఎగుమతులు 368 శాతం, భారత్ నుంచి 135 శాతం పెరిగాయి. ఇది ఆ దేశ వాహన పరిశ్రమలో ఎంట్రీ-లెవెల్ విభాగంలో అత్యధిక పోటీ ఏర్పడింది. అందుకే పన్నుల ద్వారా భారత్, చైనా వాహనాల దిగుమతులని నియంత్రించి, స్థానిక పరిశ్రమను కాపాడుకోవాలని దక్షిణాఫ్రికా వెల్లడించింది.

## మరోసారి రిలయన్స్ గ్రూప్ ఆస్తులను జప్తు చేసిన ఈడీ...



ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానికి చెందిన రిలయన్స్ గ్రూప్, దాని కంపెనీలపై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా తాజాగా ఈడీ 1,885 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్టు బుధవారం ప్రకటాలో వెల్లడించింది. తాజా చర్యలతో, ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ ఇప్పుడు సుమారు రూ. 12,000 కోట్లకు చేరింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ నివారణ చట్టం (పీఎంఎల్ఏ) కింద నాలుగు వేర్వేరు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది. జప్తు చేసిన ఆస్తులలో బ్యాంక్ బ్యాలెన్స్, రిసీవబుల్స్, అన్‌క్వోటెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, యెస్ బ్యాంక్ మోసంతో పాటు రిలయన్స్ కమ్యూనికేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన ఆరోపణల కేసులలో ఈ జప్తులు జరిగాయి. తాజా జప్తులో బీఎస్ఈఎస్ యమునా పవర్, బీఎస్ఈఎస్ రాజధాని పవర్, ముంబై మెట్రో వన్ ప్రైవేట్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఉన్న వాటాలు కూడా ఉన్నాయని ఈడీ తెలిపింది. అలాగే, వాల్యూ కార్ప్ ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ వద్ద ఉన్న రూ. 148 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, రూ. 143 కోట్ల వసూలు చేయాల్సిన మొత్తం, కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అంగరై సేతురామన్ పేరు మీద ఉన్న ఒక నివాస గృహం, మరో సీనియర్ ఉద్యోగి పునీత్ గార్గ్ భార్యకు చెందిన షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లను కూడా జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది.


## బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రణాళికపై దృష్టి పెట్టాలి



ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): ప్రపంచం 'అత్యంత ప్రమాదకరమైన సందర్భం'లో ఉన్నందున, రాబోయే బడ్జెట్ భారత ఆర్థికవ్యవస్థను మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మార్చేలా ఉండాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో వృద్ధిని వేగవంతం చేయడానికి దీర్ఘకాలిక ప్రణాళికతో అనుసంధానం చేయాలని రాజన్ సూచించారు. బుధవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. గతంలో దేశానికి పంచవర్ష ప్రణాళికలు ఉండేవి, అయినప్పటికీ దేశ బడ్జెట్ వాటితో సరిగ్గా అనుసంధానం కాలేదు. కాబట్టి ఈసారి 2026-27 కేంద్ర బడ్జెట్‌ను దీర్ఘకాలిక దార్శనికత, ప్రణాళికతో అనుసంధానం చేయాలని నేను భావిస్తున్నాను. ఒక ఆర్థికవ్యవస్థగా మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మారాలి, అదే సమయంలో వేగంగా వృద్ధి చెందాలి, దానివల్ల ఇతర దేశాలన్నీ భారత్‌తో స్నేహం చేయాలనుకుంటాయి. దీనికి చాలా కృషి చేయాల్సి ఉంది, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే తదుపరి బడ్జెట్ మనల్ని ఆ దిశగా తీసుకువెళ్తుందని నేను ఆశిస్తున్నానని ఆయన వివరించారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి అస్థిరంగా మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడానికి సంస్కరణ చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రఘురామ్ రాజన్ పైవ్యాఖ్యలు చేశారు. ప్రపంచంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థ రెండింటికీ ఇది 'అత్యంత ప్రమాదకరమైన సమయం' అని రాజన్ అన్నారు.

## అమెజాన్‌లో 16,000 ఉద్యోగాల కోత

ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): అమెరికా ఇకామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్, ప్రపంచవ్యాప్తంగా 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత అక్టోబరులో 14,000 మందిని తొలగించిన ఈ సంస్థ, రాబోయే మూడు నెలల్లో 16,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. కార్పొరేట్ ఉద్యోగులకు బదులు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించడం వల్లే, ఈ తొలగింపులు చేపడుతున్నట్లు అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గాలెట్టీ తెలిపారు. కొవిడ్-19 పరిణామాల్లో నియమించుకున్న ఉద్యోగులనూ తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్ సర్వీసెస్, రిటెయిల్, ప్రైమ్ వీడియో, మానవ వనరుల వంటి వివిధ కార్పొరేట్ రోల్స్‌లో ఉన్న 30,000 మంది ఉద్యోగులను తీసివేయాలన్నది సంస్థ లక్ష్యం. 2023లో సంస్థ 27,000 మంది ఉద్యోగులను తొలిగించాక, మళ్లీ అధికంగా కోత విధిస్తోంది ఇప్పుడే.




## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ



ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రభావంతో భారత కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇవాళ ఇంట్రాడే ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92 స్థాయిని తాకి చరిత్రలోనే సరికొత్త రికార్డు పతనాన్ని నమోదు చేసింది. భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను భారీగా వెనక్కి తీసుకుంటున్నారు. కేవలం ఈ నెలలోనే రూ.వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 65-67 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి. చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి రావడంతో రూపాయి విలువ పడిపోతోంది.

దిగుమతిదారులు, బ్యాంకుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలోపేతం కావడం రూపాయి పతానానికి కారణం అయ్యాయి. రూపాయి పతనం కేవలం సామాన్యులపై కూడా ప్రభావం చూపనుంది. మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ యంత్రాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇంధన ధరలపై ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీసే అవకాశం ఉంది. అదేవిధంగా విదేశాల్లో చదువుకునే విద్యార్థులు చెల్లించే ఫీజులు భారం కానున్నాయి. అలాగే విదేశీ పర్యటనలు ప్లాన్ చేసే వారికి ఖర్చులు పెరగనున్నాయి.

## యూఎస్ ఫెడ్ కీలక నిర్ణయం.....

ముంబై, జనవరి, 30 (సూర్యసేన ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశం ముగిసింది. 2026 సంవత్సరానికి సంబంధించి కీలక వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగించాలని ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ నిర్ణయించింది. గతేడాది చివరలో వరుసగా మూడు సార్లు రేట్లను తగ్గించిన ఫెడ్, ప్రస్తుతం బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 3.50 శాతం నుంచి నుండి 3.75 శాతంతో స్థిరంగా కొనసాగించింది. మెజారిటీ సభ్యులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేట్లలో మార్పులు చేయకూడదని ఓటు వేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మాట్లాడుతూ.. ఫెడ్ నిర్దేశించుకున్న 2 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యం కంటే ప్రస్తుత గణాంకాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఇది పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వేచి చూడాలని ఫెడ్ నిర్ణయించిందని అన్నారు. అమెరికా ఫెడ్ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపనుంది. రేట్ల తగ్గింపు లేకపోవడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లులు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి నిధులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. గతేడాది చివరలో వరుసగా మూడు సార్లు రేట్లను తగ్గించిన ఫెడ్, ప్రస్తుతం బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 3.50 శాతం నుంచి నుండి 3.75 శాతంతో స్థిరంగా కొనసాగించింది. మెజారిటీ సభ్యులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేట్లలో మార్పులు చేయకూడదని ఓటు వేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మాట్లాడుతూ.. ఫెడ్ నిర్దేశించుకున్న 2 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యం కంటే ప్రస్తుత గణాంకాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు.దీంతో సెన్సెక్స్, నిఫ్టీలపై ఒత్తడి పడనుంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవడంతో అమెరికా కంపెనీలు తమ టెక్నాలజీ ఖర్చులను నియంత్రిండంతో మన ఐటీ కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపనుంది. ఇక బంగారం ధరలు స్థిరంగా కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.



సూర్యసేన
శనివారం, జనవరి 31, 2026

# రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్




ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందిందిఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మధనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకిమధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగన గా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు. నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమం ది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్‌గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లనుఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు. దాంతో తనసినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియా లో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్ ని సాధించాడు. ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం


# అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!



ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్ ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.

నాని 'మజ్ను'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు. కానీ ఆ సినిమాలు మాత్రమే కాదు, ఆ తరువాత చేసినవి కూడా సరిగ్గా ఆడలేదు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఈ కోల కళ్ల భామ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అదృష్టం ఎదురుపడితే అమ్మడు తప్పుకుపోయిందా? లేదంటే అదృష్టమే తప్పించుకుని పోయిందా? అనేదే అభిమానులకు అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోయింది.

# ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే..



ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్స్ లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్ తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.

# వి. శాంతారామ్ బయోపిక్‌లో హీరోయిన్‌గా తమన్నా..



భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు, సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు, నిర్మాత అయిన దిగ్గజ చలనచిత్రకారుడు వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఆయన అద్భుతమైన సినీ ప్రయాణం ఆధారంగా బాలీవుడ్‌లో ఒక భారీ బయోపిక్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు ఆయన పేరునే 'వి. శాంతారామ్'గా ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టైటిల్ పాత్ర (వి. శాంతారామ్ పాత్ర)లో ప్రముఖ బాలీవుడ్ యువ నటుడు సిద్దాంత్ చతుర్వేది నటించబోతుండగా.. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే మూవీ నుంచి సిద్దాంత్‌చతుర్వేది ఫస్ట్ లుక్‌ని విడుదల చిత్రబృందం తాజాగా క థానాయికను పరిచయం చేసింది. ఈసినిమాలోహీరోయిన్‌గా తమ న్నానటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భం గా తమన్నా భాటియా ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది.

ఈ బయోపిక్‌ను రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే మరియు సరిత అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వి. శాంతారామ్ యొక్క అద్భుతమైన సినీ ప్రయాణాన్ని చూపించనుంది. సైలెంట్ యుగం (మూకీ సినిమాల కాలం) నుంచి టాకీలు (శబ్దంతో కూడిన సినిమాలు) ఆపై కలర్ సినిమా యుగం వరకు ఆయన చేసిన కృషి, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఘనమైన ప్రస్థానాన్ని ఈ చిత్రం తెరకెక్కించనుంది.


శాంతారామ్ సినీ ప్రస్థానం: 1901నవంబర్ 18, 1901లో మహారాష్ట్రలోనికోల్హాపూర్‌లో జన్మించిన వి.శాంతారామ్ 1921లో నటుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. అనంతరం నటనతో పాటు మొత్తం 55కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) లాంటి సంస్థలు స్థాపించి 92 సినిమాలకు పైగా నిర్మాతగా వ్యవహరించాడు. శాంతారామ్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అతడిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), పద్మవిభూషణ్ (1992 మరణానంతరం) లతో సత్కరించింది.

# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే




టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరి సేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించ బోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిం ది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధిం చి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది. ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నా యి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా తెలియాల్సి ఉంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం. 12లో ధోని చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టిన రాధికా ఆప్టే ఆ తర్వాత కబాలి, బాలకృష్ణ లెజెండ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

# ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!



వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థి యేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com

www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com